

# విభారె

www.vibharenews.com
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 02-02-2023 సంపుటి : 04 సంచిక : 140 పేజీలు : 4 వెల : రూ 3-00

## ఉగాది నుంచి విశాఖలో సీఎం బస్!

### ఈ బడ్జెట్ సమావేశాల్లోనే మళ్లీ మూడు రాజధానుల బిల్లు?



విజయవాడ, ఫిబ్రవరి 1, వైజాగ్ కు పాలనా రాజధాని మారుతుందా లేదా అనే ఊహాగానాలకు సీఎం జగన్ చెక్ పెట్టేశారు. త్వరలోనే విశాఖ వెళ్ళిపోతున్నానంటూ ఢిల్లీ వేదికగా క్లారిటీ ఇచ్చేశారు. వైజాగ్‌లో మార్చి నెలలో జరిగే ఇన్వెస్టర్స్ మీట్ కు పెట్టుబడుదారులను ఆహ్వానించేందుకు ఢిల్లీ వెళ్లిన జగన్... రాజధాని విశాఖ అని తాను కూడా త్వరలోనే షిఫ్ట్ అవుతున్నానంటూ చేప్పారు. వైజాగ్ చుట్టుపక్కల పెట్టుబడులు పెట్టాలని ఇన్వెస్టర్స్‌కు పిలుపిచ్చారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ వరుసగా నెంబర్ వన్‌గా ఉందని సీఎం తెలిపారు . ప్రస్తుతానికి లీగల్‌గా ఏపీకి రాజధాని అమరావతి మాత్రమే. కేంద్రం కూడా అదే విషయాన్నీ తెలిపింది. దానితో ఒకవేళ వైజాగ్‌ను రాజధానిగా ప్రకటించాలి అంటే అసెంబ్లీలో మళ్ళీ బిల్ పెట్టాలి. దానికి గవర్నర్ ఆమోద ముద్ర పడాలి. దానికి చాలాసమయం పట్టే అవకాశం ఉండడంతో ముందుగా సీఎం క్యాంపు కార్యాలయాన్ని వైజాగ్‌లో ఏర్పాటు చెయ్యనున్నారు. ఉగాది నాటికి సీఎం క్యాంపు కార్యాలయాన్ని విశాఖ తరలించి వారంలో రెండు లేదా మూడు రోజులు అక్కడి నుండే పాలన సాగించనున్నారు ముఖ్యమంత్రి జగన్. మిగిలిన రోజుల్లో అమరావతి నుంచి పాలన సాగిస్తారని ముఖ్యమంత్రి కార్యాలయం వర్గాల సమాచారం . సీఎం జగన్ విశాఖకు షిఫ్ట్ అవుతున్న నేపథ్యంలో ఆయన కార్యాలయం ఏర్పాటు కోసం భవనాలను గుర్తించే పనిలో పడ్డారు అధికారులు. రిషికొండపై రెడీ అవుతున్న భవనం సహా .. ఏయూలోని పలు భవనాలు .. కలెక్టర్ కార్యాలయం.. సర్క్యూట్ హౌస్.. టౌన్ హాల్ ఇలా అనేక భవనాలు రెడీగా ఉన్నాయి. వీటిలో సీఎం కార్యాలయం ఏర్పాటుకు ఏది అనువుగా ఉంటుందో తేల్చే పనిలో పడ్డారు అఫీషియల్స్. విశాఖకు రాజధానిని తరలించే ప్రయత్నం వేగవంతం అవుతున్నవేళ రానున్న సమావేశాల్లోనే మూడు రాజధానుల బిల్లు మరోసారి అసెంబ్లీ ప్రవేశ పెట్టబోతోంది ఏపీ ప్రభుత్వం అంటున్నారు విశ్లేషకులు . తాజాగా సీఎం చేసిన ప్రకటనతో ఆ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. ఏదేమైనా సీఎం జగన్ తాను అతి త్వరలోనే హలో వైజాగ్ అనడం ఖాయం అని తేల్చేసారు

## రైతాంగానికి పెద్దపీట



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1,కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సాధారణ బడ్జెట్-2023ను ప్రవేశపెట్టారు. 2023 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి.. రైతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రైతుల ఆదాయాన్ని పెంచేందుకు అనేక చర్యలు తీసుకున్నారు. కిసాన్ సమృద్ధి యోజన తర్వాత ఈ సంవత్సరం ప్రభుత్వం అనేక ఇతర పథకాలను ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. పశు పోషకులు, మత్స్యకారుల కోసం బీజేపీ సర్కారు అనేక చర్యలు తీసుకుంది. సార్వత్రిక బడ్జెట్ ప్రసంగం సందర్భంగా.. ఆర్థిక మంత్రి సహకారంతో రైతుల కోసం అభ్యుదయ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు. దీని ద్వారా 63000 అగ్రి సొసైటీలను కంప్యూటరీకరిస్తారు. ఇది రైతులు అభివృద్ధి చెందడానికి దోహదపడుతుంది. దీంతో పాటు పశుసంవర్థక, మత్స్య, మల్టీపర్పస్ కార్పొరేట్ సొసైటీల్లో రుణాల మంజూరులో వేగం పెంచుతామని ప్రకటించింది. దీనితో పాటు ప్రధాన మంత్రి మత్స్య పాలన్ యోజనను కూడా ప్రారంభించాలని ఆర్థిక మంత్రి నిర్ణయించారు.

అదే సమయంలో డిజిటల్ టెక్నాలజీ ద్వారా వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కూడా సర్కారు చూస్తోంది. బుధవారం ప్రవేశపెట్టిన 2022-23 ఆర్థిక బడ్జెట్లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ భారతదేశం చిరు ధాన్యాలకు కేంద్రం అని అన్నారు. పౌష్టికాహారం, ఆహార భద్రత, రైతు పథకాల కోసం చిరుధాన్యాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం శ్రీ అన్న యోజనను ప్రారంభించాలని నిర్ణయించిందని వివరించారు. పోషకాలు అధికంగా ఉండే ధాన్యాల కోసం చిరుధాన్యాల పరిశోధనా కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని ఆమె వివరించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా దీనిని ఆర్థిక కాలానికి తొలి బడ్జెట్ గా అభివర్ణించారు.

2023 బడ్జెట్ లో వ్యవసాయ రంగానికి చేయూత..

భారతదేశం తృణ ధాన్యాలకు ప్రపంచ కేంద్రంగా మారుతుంది.

రైతులకు పౌష్టికాహారం, ఆహార భద్రత, ప్రణాళిక కోసం తృణ ధాన్యాల ఉపోయోగాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

శ్రీఅన్నా రాడి, శ్రీఅన్నా బజ్రా, శ్రీఅన్నా రందానా, కుంగ్ని, కుట్టు అన్ని ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలను కలిగి ఉన్నాయి.

మినుము రైతులు ప్రజలకు ఎంతో సహకారం అందించారు.

శ్రీఅన్నను హబ్‌గా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

శ్రీఅన్న ప్రొడక్షన్‌కి హైదరాబాద్‌లోని రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నుంచి చాలా సాయం అందుతోంది.

సహకార్ సే సమృద్ధి...

"సహకార్ సే సమృద్ధి" కార్యక్రమం రైతుల కోసం నడుస్తుంది.

దీని ద్వారా 63000 అగ్రి సొసైటీలను కంప్యూటరీకరిస్తారు.

ఇది రైతులు అభివృద్ధి చెందడానికి దోహదపడుతుంది.


పశుసంవర్ధక, మత్స్య రంగాల్లో రుణాలు ఇవ్వడంలో వేగం పెరుగుతుంది.

మల్టీపర్పస్ కార్పొరేట్ సొసైటీని ప్రోత్సహిస్తారు.

మత్స్య సంపద కోసం కార్పొరేట్ సొసైటీలను కూడా పెంచుతాం

## ఆ స్కూళ్లలో 38,800 ఉద్యోగాలు: కేంద్రం

దిల్లీ: దేశవ్యాప్తంగా ఏకలవ్య ఆదర్శ పాఠశాలల్లోభారీ సంఖ్యలో బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు చేపట్టనున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.ఈ మేరకు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2023-24(జనితినీని ఃబీటణవబి 2023-24)లో ఈ విషయాన్ని వెల్లడించారు. ఏకలవ్య ఆదర్శ పాఠశాలల్లో 38,800 ఉపాధ్యాయ, సహాయక సిబ్బంది ఉద్యోగాలను భర్తీ చేస్తామని తెలిపారు. వచ్చే మూడేళ్లలో దేశంలోని 740 ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలల్లో 3.5లక్షల మంది ఆదివాసీ విద్యార్థులకు విద్యాబోధన అందించడమే లక్ష్యంగా ఈ భారీ రిక్రూట్‌మెంట్ చేపట్టనున్నట్టు వివరించారు.ప్రస్తుతం కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ వెబ్‌సైట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం దేశవ్యాప్తంగా 689 ఏకలవ్య పాఠశాలలు ఉన్నాయి. ఆదివాసీల సామాజిక, ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగుపరిచే ఉద్దేశంతో కొత్త పథకాన్ని నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రతిపాదించారు. రూ. 15వేల కోట్లతో పీఎం-పీవీటీజీ డెవలప్‌మెంట్ మిషన్‌ను మూడేళ్లలో అమలు చేస్తామని తెలిపారు.



సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ఆదివాసీ కుటుంబాలు, సమూహాలకు కనీస సదుపాయాలైన ఇళ్ల నిర్మాణం, సురక్షితమైన తాగునీరు, మరుగుదొడ్లు, ఆరోగ్యం, విద్య, పౌష్టికాహారం, రోడ్లు, టెలిఫోన్ కనెక్టివిటీ వంటి సౌకర్యాలను కల్పించడమే తమ లక్ష్యమన్నారు. మరోవైపు, దేశంలో కొత్తగా మరో 157 కొత్త నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయనున్నట్టు నిర్మలా సీతారామన్ వెల్లడించారు.

## భూమి, ఇసుక, మద్యం నుంచి గనుల వరకు వచ్చే ప్రతి పైసా జగన్ చేతిలోనే: పవన్

అమరావతి: సీఎం వైఎస్ జగన్ తీరుపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ ట్విటర్ వేదికగా విమర్శలు సంధించారు. వైకాపా పాలనపై తనదైన శైలిలో స్పందించారు."అరకులో బాక్సైట్ తవ్వకాలను ప్రోత్సహిస్తున్న భారతదేశంలోనే అత్యంత ధనిక ముఖ్యమంత్రి.. కామ్రేడ్ చారు మజుందార్, కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి, కామ్రేడ్ పుచ్చపల్లి సుందరయ్య వంటి 'క్లాస్ వార్' గురించి మాట్లాడుతున్నారు. ఇదో విచిత్రం!. ఆంధ్రప్రదేశ్‌లో వర్గాలకు తావు లేదు, ప్రజలంతా వైకాపా రాజ్యానికి బానిసలుగా అయిపోయారు. భూమి నుంచి ఇసుక వరకు, మద్యం నుంచి గనుల వరకు, అడవుల నుంచి కొండల వరకు, కాగితం నుంచి ఎర్రచందనం వరకు ఏపీ నుంచి వచ్చే ప్రతి పైసా ధనిక ముఖ్యమంత్రి చేతిలోనే ఉంది. నిజంగా ఇదో గొప్ప కళాఖండం.!వైకాపా ఏపీలోని పేదలను సామాన్యతతో సంతృప్తిగా ఉండేలా చేసింది. వారి జీవితాలు, గౌరవం, శ్రమ కొన్ని డబ్బులకు అమ్ముడుపోయాయి. ఏపీలో మిడిల్ క్లాస్‌పై అత్యంత నిర్లక్ష్యం. వారిని టాక్స్ పేయింగ్ మూగ సేవకులుగా వైకాపా పరిగణిస్తోంది. వైకాపా ఆంధ్ర రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహం తీసుకురాగలిగినప్పుడు.. దావోస్ ఎవరికి కావాలి? మన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి ఇప్పటికే నూడుల్స్ సెంటర్, చాయ్ పాయింట్లను ప్రారంభించారు. ఇప్పుడు ఐటీ కంపెనీల ఏర్పాటు కోసం మాత్రమే వేచి ఉన్నారు. ఇదో చిత్రమైన పరిణామం" అని పవన్ కల్యాణ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## నెల్లూరు జిల్లా వైకాపాలో ముసలంపై సీఎం జగన్ దృష్టి

తాడేపల్లి: నెల్లూరు జిల్లా వైకాపా(జూఖీఅఖ)లో ముసలంపై సీఎం జగన్ (అఓ ఏంఉంఔ)దృష్టి సారించారు. నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల నేపథ్యంలో సీఎం జగన్‌తో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి,



ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు భేటీ అయ్యారు.వైకాపా ఎమ్మెల్యేలు ఆనం, కోటంరెడ్డి తీరుపై భేటీలో చర్చించారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై ప్రధానంగా చర్చించినట్టు తెలుస్తోంది. నెల్లూరు గ్రామీణ ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి కోటంరెడ్డిని తప్పించే అవకాశమున్నట్టు సమాచారం. కోటంరెడ్డి స్థానంలో ఎవరిని నియమించాలనే అంశంపై సీఎం జగన్ చర్చించారు.నెల్లూరు జిల్లాలో అధిష్ఠానం తీరుపై వైకాపా ఎమ్మెల్యేల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఇటీవల ఆనం రామనారాయణరెడ్డి అధిష్ఠానం తీరుపై బాహాటంగా విమర్శలు చేయగా.. తాజాగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన అసంతృప్తిని వెళ్లగక్కారు. వచ్చే ఎన్నికల్లో వైకాపా నుంచి పోటీ చేయాలని తనకి లేదని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి (ఐనీబిజీఏతీవటటఎ) స్పష్టం చేశారు. ఇంటెలిజెన్స్ అధికారులు తనపై నిఘా పెట్టి ఫోన్ ట్యాప్ (ఖష్త్రనీనివ జీజూజూతినిణ) చేస్తున్నారంటూ గత రెండు రోజులుగా ఆరోపణలు చేస్తున్న ఆయన.. బుధవారం నెల్లూరులో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటెలిజెన్స్ చీఫ్ సీతారామాంజనేయులు సహా సొంత పార్టీ నేతలను ఉద్దేశించి కోటంరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

## 'కోటంరెడ్డి బ్రదర్స్ తినే ప్రతి మెతుకు సీఎం జగన్ పెట్టిన భిక్షే'



నెల్లూరు: నెల్లూరు రూరల్‌ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చేసిన ఆరోపణలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు ఆనం విజయ్‌కుమార్ రెడ్డి.జిల్లాలో అనవసరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. అధిష్టానం గుర్తిస్తేనే ఎవరైనా ఎమ్మెల్యే కాగలరని పేర్కొన్నారు. కోటంరెడ్డి పార్టీలో గుర్తింపు లేదనడం భావ్యం కాదన్నారు.పార్టీ నుంచి వెళ్లాలని కోటంరెడ్డికి ఎవరూ చెప్పలేదని విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. నెల జీతాలిచ్చి రౌడీషీటర్లను పెట్టుకొని దందాలు చేసిన వ్యక్తి ఆయన అని వ్యాఖ్యానించారు. హింసా రాజకీయాలు చేసి నీచ సంస్కృతికి తెరలేపారని ధ్వజమెత్తారు. కోటంరెడ్డి సోదరులు రాక్షసులుగా వ్యవహరించారని ఫైర్ అయ్యారు.కౌన్సిలర్ స్థాయి కూడా లేని కోటంరెడ్డిని సీఎం జగన్ ఎమ్మెల్యేని చేశారని విజయ్‌కుమార్ రెడ్డి గుర్తు చేశారు. ఆయన ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. కోటంరెడ్డి బ్రదర్స్ తినే ప్రతి మెతుకు సీఎం జగన్ పెట్టిన భిక్షే అన్నారు. టీడీపీతో కుమ్మక్కై అన్నం పెట్టిన పార్టీపై అభాండాలు మోపుతారా అని ప్రశ్నించారు.తన సోదరుడు ఆనం రామనారాయణరెడ్డి కూడా ఏం తక్కువై పార్టీకి దూరమయ్యారో తెలియడం లేదని విజయ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## అందరికీ ఉపయోగపడేలా కేంద్ర బడ్జెట్ : మంత్రి బుగ్గన

అమరావతి: కేంద్ర బడ్జెట్‌ను (ఃబీటణవబి 2023) మంచి బడ్జెట్ అని భావిస్తున్నామని ఏపీ ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు.కేంద్ర బడ్జెట్‌పై బుగ్గన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఏడాది



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ అందరికీ ఉపయోగపడే విధంగా ఉందన్నారు. ''రాష్ట్రానికి ఎరువుల్లో రూ. 50వేల కోట్లు తగ్గించారు. రాష్ట్ర ప్రభుత్వం సలహాల మేరకు కేటాయింపులు చేసినందుకు ధన్యవాదాలు. రాష్ట్రంలో సౌర విద్యుత్ ప్లాంట్ల కోసం పాలసీ ప్రకటించారు. ఏపీ విజ్ఞప్తితో పీఎం ఆవాస్ యోజన నిధులు పెంచారు. రాష్ట్రంలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు అభినందనీయం. ఎయిర్‌పోర్టులు, పోర్టులు, హెలిప్యాడ్‌ల ఏర్పాటుతో ప్రయోజనం. వ్యక్తిగత పన్ను మినహాయింపు రూ.7లక్షలకు పెంచడం అభినందనీయం. బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక అంశాలు ఇంకా తెలియరాలేదు" అని బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు.

సీఎం ఎక్కడ ఉంటే అదే సీఎం పరిపాలనా కార్యాలయం: బుగ్గన

పాలన వికేంద్రీకరణ చేయడమే రాష్ట్ర ప్రభుత్వ విధానమని బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఒకే చోట అభివృద్ధి ఉండకూడదనేది ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. "విశాఖ రాజధాని అని సీఎం జగన్ ప్రకటన చేశారు. సీఎం ఎక్కడ ఉంటే అదే సీఎం పరిపాలన కార్యాలయం. రాజధాని అనే పదం రాజ్యాంగంలో ఎక్కడా ప్రస్తావించలేదు" అని బుగ్గన అన్నారు.

## ఇంకేం చర్యలు తీసుకుంటాం.. కోటంరెడ్డి వ్యవహారంపై స్పందించిన సజ్జల

తాడేపల్లి: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వ్యవహారంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణా రెడ్డి స్పందించారు.బుధవారం వైసీపి కేంద్ర కార్యాలయంలో రాష్ట్రస్థాయి సర్పంచ్‌ల సమావేశంలో పాల్గొన్న ఆయన.. మీడియాతో మాట్లాడారు. కోటంరెడ్డి టీడీపీలోకి వెళ్లాలని నిర్ణయించుకున్న తర్వాత తీవ్ర ఆరోపణలు చేస్తున్నారని సజ్జల పేర్కొన్నారు."కోటంరెడ్డి పై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏముంది?. ఆయనే తన ఉద్దేశాలు చెప్పిన తర్వాత చర్యలు ఏం తీసుకుంటాం?. అయినా.. ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం మా ప్రభుత్వానికి లేదు. ముఖ్యమంత్రి జగన్ ప్రజలను నమ్ముకుని పాలన చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్‌లను కాదు" అని సజ్జల స్పందించారు. ఎవరైనా ఎవరికైనా ఫిర్యాదు చేసుకోవచ్చని.. పదవి రాలేదని అసంతృప్తి ఉండటం వేరు, బహిరంగంగా ఇటువంటి ఆరోపణలు చేయటం వేరని సజ్జల వ్యాఖ్యానించారు.అలాగే.. అక్కడి నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఇంకా ఎవరినీ నియమించ లేదన్న సజ్జల.. కొంతమందిని ఎలా లాక్కోవాలో ప్రతిపక్ష నేత చంద్రబాబుకు తెలుసని సజ్జల వ్యాఖ్యానించారు.ప్రకాశం: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి టీడీపీ డైరెక్షన్ లో మాట్లాడుతున్నాడని మాజీమంత్రి, వైఎస్సార్‌పీపీ రీజనల్ కో ఆర్డినేటర్ బాలినేని వ్యాఖ్యానించారు. "ఫోన్ ట్యాపింగ్ లేదు.. పాడు లేదు.. మంత్రి పదవి ఇవ్వలేదనే అక్కసుతోనే శ్రీధర్ రెడ్డి, ఆనం డ్రామాలు ఆడుతున్నారు. దమ్ముంటే ఫోన్ ట్యాపింగ్ అయినట్టు నిరూపించాలని సవాల్ విసిరారు బాలినేని. ఫోన్ ట్యాప్ అయితే ఎమ్మెల్యే ఆనం ఇన్ని రోజులు ఎందుకు బయటపెట్టలేదని నిలదీశారు. రేపో ఎల్లుండో నెల్లూరు రూరల్ కి కొత్త ఇంచార్జి నియామకం ఉంటుందని, వాళ్లిద్దరూ కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని బాలినేని మండిపడ్డారు. వైస్సార్సీపీ లో నాయకులకు కొదవలేదు.. ఒకరు పోతే పది మంది తయారవుతారని బాలినేని కామెంట్ చేశారు.

# సంపాదకీయం

గురువారం 02-02-2023

## ఎన్నికలల బడ్జెట్

ఎన్నో ఆకాంక్షలు, మరెన్నో ఆశలతో కూడుకున్న బడ్జెట్ 2023 ప్రజల ముందు?కు రానే వచ్చింది. 7 అంశాలపై ఫోకస్ పెట్టారు. ఢిల్లీలో బీజేపీ సర్కార్ వచ్చినప్పటి నుండి ? ఆదాయపు పన్ను మినహాయింపులు పెంచక.. అటు జీఎస్టీలు బాదేస్తూ.. మరో వైపు పెట్రో పన్నులను వడ్డిస్తూ.. మధ్యతరగతికి చూపించిన నరకానికి నిర్మలా సీతారామన్ కాస్త రిలీఫ్ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఆ?దాయపు పన్ను పరిమితిని ఊహించినంతగా కాకపోయినా కాస్త పెంచి రిలీఫ్ ఇచ్చారు. గత ఏడేళ్లుగా ఎదురుచూస్తూ .. నిరాశ పడుతున్న వారు ఈ సారి పెద్దగా ఆశలు పెట్టుకోలేదు. అంచనాలు లేకపోవడం వల్ల ఇచ్చిన మినహాయింపులు గొప్పగా అనిపిస్తున్నాయి. ప్రస్తుతం రూ. 5లక్షలుగా ఉన్న ఆదాయపన్ను పరిమితిని రూ. రూ. 7 లక్షలకు పెంచుతున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అయితే ఇది కొత్త పన్ను విధానాన్ని ఎంపిక చేసుకున్న వారికే. ఏడు లక్షల లోపు ఆదాయం ఉంటే.. ఇతర మినహాయింపులేమీ పెట్టుకోకుండా పన్ను మినహాయింపులు పొందవచ్చు. ఇక పాత శ్లాబ్ విధానంలోనూ కాస్తంత వెసులుబాటు కల్పించారు. ఇప్పటి వరకూ రూ. రెండున్నర లక్షలు ఉన్న ఆదాయపు పన్ను పరిమితిని రూ. 3 లక్షల వరకు పెంచారు. శ్లాబుల్ని ఆరు నుంచి ఐదుకు తగ్గించారు. రూ. 3 నుంచి 6 లక్షల వరకు ఆదాయం ఉన్న వారు 5శాతం, రూ. 6 నుంచి 9 లక్షల వరకు 10శాతం,9 నుంచి 12 లక్షల వరకు ఆదాయం ఉంటే 15శాతం, రూ. 12 నుంచి 15 లక్షల వరకు 20 శాతం ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. రూ. 15 లక్షల ఆదాయం దాటిన వారు 30శాతం ట్యాక్స్ కట్టాలి. ద్రవ్యోల్బణానికి తగ్గట్లుగా చూసుకుంటే.. ఈ మినహాయింపులు పెద్ద ఊరట కాదు కానీ.. ఎంతో కొంత కనికరించారని సంతోషపడటమే ఇది అమృత కాల బడ్జెట్ అనీ,దీనికి గత బడ్జెట్ లోనే గట్టి పునాది పడిందని ఆమె అన్నారు. అంతర్జాతీయ సవాళ్ల మధ్య మన దేశం తలయెత్తుకొని సగర్వంగా నిల బడిందనీ, సమిష్టి ప్రగతి దిశగా దేశం పయనిస్తుందని నిర్మలా భరోసా ఇచ్చారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ భారత ఆర్థిక వ్యవస్థ సరైన మార్గంలో ఉందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశ జీడీపీ వృద్ధి రేటు అత్యంత వేగంగా ఉందన్నారు. వృద్ధి రేటును 7శాతంగా అంచనావేస్తున్నామని ఆమె పేర్కొన్నారు.ముఖ్యంగా పేదలు, యువత, మహిళలు, రైతులు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఈ బడ్జెట్ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. అంత్యోదయ వర్గాల వారికి సంత్సరం పాటు గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం జనవరి 2023 నుంచి ఉచిత ధాన్యాల పంపిణీ స్కీంను ప్రశేపెడుతున్నాం. దీని య్యే మొత్తం ఖర్చును 2 లక్షల కోట్లు కేంద్రం భరిస్తుంది. కోవిడ్ , యుద్ధం లాంటి భయంకరమైన పరిస్థితుల్లో కూడా గ్లోబల్‌గా నెలకొన్న మాంద్యం పరిస్థితుల్లో భారత ఆర్థిక వ్యవస్థంగా దృఢంగా నిలబడింది. కోవిడ్ అడ్డుకోవడంలో చాలా వేగంగా పనిచేశాం. 102 కోట్ల మందికి వ్యాక్సన్స్ అందించాం వ్యాక్సినేషన్ డ్రైవ్ శరవేగంగా చేపట్టామని ఆమె చెప్పారు. త్వరలోనే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్‌ని ఏర్పాటు చేస్తాం. 100వ స్వాతంత్ర్య దినోత్సవం నాటికి భారత్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దేశంగా ఎదుగుతుంది. గ్రామీణ మహిళలకు స్వయం సహాయక బృందాల ద్వారా లబ్ధి జరిగింది. భవిష్యత్‌లో ఈ సాయం ఇంకా పెరుగుతుంది. ఆత్మ నిర్భరత భారత్‌కు ఇది నిదర్శనం. గ్రామీణ మహిళలకు సాయం చేయడమే కాదు. వారు నైపుణ్యాలు పెంచుకునేందుకూ తోడ్పడుతున్నాం. సామాజిక భద్రతనూ కల్పిస్తున్నామన్నారు కేంద్ర ఆర్థిక మంత్రి ఈ బడ్జెట్‌లో కీలకంగా 7 అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు. దేశంలో గత కొన్నేళ్లలో తలసరి ఆదాయం రెట్టింపైంది. గతంలో కన్నా భారత దేశ ఆర్థిక వ్యవస్థ ఆర్గనైజ్డ్‌గా మారింది. ప్రజల జీవన శైలి కూడా మారింది. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తున్నాం. ప్రత్యేక నిధులు అందించి సాగు రంగంలో అంకుర సంస్థలకు తోడ్పాటనందిస్తాం. సవాళ్లు ఎదుర్కొనే రైతులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. వెనకబడిన వర్గాలకు ప్రయారిటీ ఇచ్చారు. సామాజిక భద్రత, డిజిటల్ పేమెంట్‌ల విషయంలో భారత్ అనూహ్య వృద్ధి సాధించింది. పీఎం సురక్ష, పీఎం జీవన జ్యోతి యోజన పథకాల కింద 220 కోట్ల కరోనా వ్యాక్సిన్ డోస్‌లు అందించాం. కోట్లాది మంది ప్రజలు పీఎం కిసాన్ నిధి ద్వారా లబ్ధి పొందుతున్నారు. సామాన్యుల సాధికారతకు ఈ బడ్జెట్ నిదర్శనం. సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్ నినాదంతో ప్రభుత్వం అన్ని వర్గాలకూ అభివృద్ధి ఫలాలు అందజేస్తోంది. 28 నెలల్లోనే 80 కోట్ల మంది ఆహార ధాన్యాలు అందించడం సామాన్య విషయం కాదని అభిప్రాయపడ్డారు కేంద్ర ఆర్థిక మంత్రి

## వైఎస్ఆర్‌సీపీలో ఫోన్ ట్యాప్ బాంబ్

నెల్లూరు, ఫిబ్రవరి 1, నెల్లూరు జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యేల ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరింత ముదిరింది. ఇప్పటికే రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ పై రచ్చ చేయగా, తాజాగా వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి కూడా అవే ఆరోపణలు చేశారు. తాను ఆఫ్ ది రికార్డ్ గా మాట్లాడ్డంలేదని, ఆన్ రికార్డే చెబుతున్నానని చెప్పారు. సొంత పార్టీ వాళ్లే ట్యాప్ చేస్తే ఇక తానెవరికి చెప్పుకోవాలన్నారు ఆనం. తన ఫోన్లు, తన పీఏ ఫోన్లు కూడా ఏడాదిన్నరగా ట్యాపింగ్ చేస్తున్నారని మండిపడ్డారు ఆనం రామనారాయణ రెడ్డి. నెల్లూరు జిల్లాలో మాఫియా గ్యాంగ్ లు రాజ్యమేలుతున్నాయని తాను ఏడాదిన్నర క్రితం కామెంట్లు చేసినప్పటి నుంచి తన ఫోన్లు ట్యాపింగ్ కి గురవుతున్నాయని అన్నారు. ఆఫ్ ది రికార్డ్ చెప్పాల్సిన ఖర్మ పట్టలేదని, తాను ఆన్ రికార్డే చెబుతున్నానన్నారు రామనారాయణ రెడ్డి. ముఖ్యమైన సందేశాలుంటే వాట్సప్, ఫేస్ టైమ్ యాప్ ద్వారా కాల్స్ చేసుకుంటున్నానని చెప్పారు. కన్న కూతురితో ఫోన్లో మాట్లాడాలనుకున్నా ఫేస్ టైమ్ వీడియో కాల్ లో మాట్లాడుతున్నానని చెప్పారు. అధికార పార్టీయే ట్యాప్ చేస్తున్నప్పుడు ఇక నేనెవరికి చెప్పుకోవాలని ఆయన ప్రశ్నించారు. తనకు భద్రత తగ్గించారని.. ఉన్న భద్రతను కూడా తీసేయాలని ఆనం ప్రభుత్వాన్ని కోరారు. తన ప్రాణానికి ముప్పు ఉందన్నారు. ప్రాణఆలు తీసేందుకు కూడా తెగిస్తున్నారని.. తాను దేనికైనా సిద్దంగా ఉన్నానని ప్రకటించారు. తాను చనిపోతే తన లాంటి వాళ్లు మరో పది మంది పుట్టుకు వస్తారన్నారు. ఇలాంటి పోకడలు గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. స్థానికంగా ఉన్న అధికారులను మార్చడంతో పాటూ తన భద్రతను కూడా తగ్గించారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో రాజ్యాంగేతర శక్తులు అధికారం చెలాయిస్తున్నాయని, ఇది సరైన పద్ధతి కాదంటూ హితవు పలికారు. తాను ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చంద్రబాబు అధికారంలో ఉన్నా తన సెక్యూరిటీని తగ్గించలేదని గుర్తు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో తన ప్రమేయం లేకుండానే సెక్యూరిటీని తొలగించారని తెలిపారు. జగన్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉందని, ఈ పరిణామాలు ఎటువైపు దారి తీస్తాయో చూడాల్సి ఉందని ఆనం పేర్కొన్నారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం అధికార పార్టీ మెడకు చుట్టుకునే అవకాశముంది. సొంత పార్టీ నేతలే ఆరోపణలు చేస్తున్నారంటే, ఇక ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర నేతల ఫోన్లు కూడా కచ్చితంగా ట్యాప్ చేస్తుంటారనే అపప్రథ బలపడుతోంది. దీంతో ప్రతిపక్ష పార్టీ ఈ వ్యవహారాన్ని మరింత పెద్దది చేసే అవకాశముంది. నెల్లూరుతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా ఎవరైనా ఇలాగే ముందుకొచ్చి ఫోన్ ట్యాపింగ్ గురించి మాట్లాడితే కచ్చితంగా దీనిపై ప్రభుత్వం లేదే పోలీసులు ఎంక్వయిరీ మొదలు పెట్టాల్సి రావొచ్చంటున్నరా?. తమ తప్పు లేదని చెప్పుకోడానికైనా వారు ఏదో ఒక స్టేట్ మెంట్ ఇవ్వాల్సి ఉందని చచెబుతున్నారు. ఇటీవల ఆనంకు వైసీపీకి మధ్య గ్యాప్ బాగా పెరిగింది. వెంకటగిరి నియోజకవర్గానికి వైసీపీ ఎమ్మెల్యేగా రామనారాయణ రెడ్డి ఉన్నా కూడా పార్టీ తరపున నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డిని ఇన్ చార్జ్ గా నియమించడంతో కలకలం రేగింది. ఆ తర్వాత క్రమక్రమంగా ఆనం అధికారాలకు కత్తెర పడింది. అధికార్లుల్ని మార్చేసిన రామ్ కుమార్ రెడ్డి, ఆనంను సభలు, సమావేశాలకు రావొద్దన్నారు. గడప గడప కార్యక్రమానికి కూడా ఆయన్ను తిరగనివ్వడంలేదు. ఈ దశలో ఆనం రామనారాయణ రెడ్డి ఆ ఎపిసోడ్ పై తొలిసారిగా రియాక్ట్ అయ్యారు. రాజ్యాంగేతర శక్తుల్ని నియమించడం సరికాదన్నారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలను కాదని, రాజ్యాంగేతర శక్తుల్ని ఎందుకు ప్రోత్సహిస్తున్నారని నిలదీశారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ఒడుదొడుకులు చూశానన్నారు. పోలీస్ సెక్యూరిటీ కూడా తనకు తగ్గించేశారని, ఎవరి ఆత్మవంచనకోసం ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఎన్నికలకింకా 15 నెలలు సమయం ఉందన్నారు. నాలుగేళ్ల పాలనలోనే వైసీపీ సమర్థతపై చర్చ మొదలవడం దురదృష్టకరం అన్నారు. రాష్ట్రంలో రెండు ప్రాంతీయ పార్టీలే అధికారం కోసం పోటీ పడుతున్నాయని చెప్పారు. ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కూడా ఆనం నోరు విప్పడంతో ఈ వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారాయి.

## వివేకా కేసులో ఫోన్ నెంబర్ల రచ్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 1,ముఖ్యమంత్రి చిన్నాన్న వైఎస్.వివేకానంద రెడ్డి హత్య కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కేసు విచారణలో సిబిఐ వేగం పెంచింది. వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజు అవినాష్ రెడ్డి మొబైల్ నంబర్ నుంచి కాల్స్ వెళ్లినట్లు గుర్తించిన సిబిఐ అధికారులు ఆ నంబర్ ఎవరదని ఆరా తీస్తున్నారు. గత వారం అవినాష్ రెడ్డిని విచారించిన సమయంలో వెల్లడైన విషయాల ఆధారంగా ముఖ్యమంత్రి నివాసంలో ఉండే ఓ వ్యక్తి నంబరుకు పలుమార్లు ఫోన్లు చేసినట్లు గుర్తించారు.జనవరి 28న అవినాష్ రెడ్డి విచారణలో వివేకా హత్య తర్వాత ఎవరెవరితో మాట్లాడారనే విషయాలపై సిబిఐ ఆరా తీసింది. దా?దాపు నాలుగున్నర గంటల పాటు అవినాష్ రెడ్డిని సిబిఐ విచారించింది. తనకు తెలిసిన సమాచారం మొత్తాన్ని అవినాష్ రెడ్డి సిబిఐకు తెలియచేసినట్లు చెప్పారు. సిబిఐ విచారణలో అవినాష్ రెడ్డి కాల్‌డేటా ఆధారంగా ప్రశ్నించడంతో మరికొందరి పేర్లు తెరపైకి వచ్చాయి.వివేకా హత్య తర్వాత నవీన్ అనే వ్యక్తి పేరుతో ఉన్న ఫోన్ నంబరుతో అవినాష్ రెడ్డి పలుమార్లు మాట్లాడినట్లు గుర్తించారు. దీంతో నవీన్ ఎవరనే విషయంపై సిబిఐ ఆరా తీసింది. ముఖ్యమంత్రి కార్యాలయంలో సిఎంతో జరిపే సంప్రదింపులకు నవీన్ ఫోన్ నంబరును వినియోగిస్తున్నట్లు సిబిఐ గుర్తించింది. నవీన్ ఫోన్ నంబరు ద్వారా అవినాష్ రెడ్డి ఎవరెవరితో మాట్లాడారనే దానిపై ప్రస్తుతం సిబిఐ ఆరా తీస్తోంది. ఈ క్రమంలోనే సిబిఐ విచారణకు హాజరు కావాల్సిందిగా నవీన్‌కు నోటీసులు జారీ చేసినట్లు చెబుతున్నారు. మరోవైపు వివేకా హత్య కేసు దర్యాప్తులో భాగంగా పులివెందులలో ఉన్న సిఎం జగన్ ఓఎస్డీ కార్యాలయానికి కూడా సిబిఐ అధికారులు వెళ్ళారు.ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిన్నాన్న వివేకానంద రెడ్డి హత్య జరిగిన తర్వాత అవినాష్ రెడ్డి, నవీన్ ఫోన్ నంబరు ద్వారా తాడేపల్లిలో ఉన్న కీలక వ్యక్తులతో మాట్లాడినట్లు భావిస్తున్నారు. నవీన్‌ను ప్రశ్నిస్తే ఈ వ్యవహారంలో స్పష్టత వస్తుందని భావించిన సిబిఐ అధికారులు విచారణకు హాజరు కావాల్సిందిగా ఆదేశించారు. విజయవాడలో ఉండే నవీన్‌ను హైదరాబాద్ సిబిఐ కార్యాలయంలో విచారణకు హాజరు కావాల్సిందిగా ఆదేశించారు. నవీన్‌తో పాటు మరో నంబరుకు కూడా అవినాష్ రెడ్డి కాల్స్ చేయడంతో దాని ద్వారా ఎవరితో మాట్లాడారనే విషయంపై సిబిఐ కూపీ లాగుతోంది. రెండు నంబర్లను వినియోగిస్తున్న వారిని ఈ వారంలో సిబిఐ ప్రశ్నించనుంది.

## సగం మంది రైతులకు పీఎం కిసాన్ తొలగింపు

విజయవాడ, ఫిబ్రవరి 1, ఆంధ్రప్రదేశ్ లో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి అర్హులైన రైతుల సంఖ్య భారీగా తగ్గిపోయింది. కేంద్రం విధించిన నిబంధనలు రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులను లబ్దికి దూరం చేస్తున్నాయి. ఇంతకు ముందు స్కీంకు అనర్హులంటూ పెట్టిన షరతులకు తోడు ఈ-కెవైసి వంటి వాటిని అదనంగా జోడించడంతో పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు అర్హులు కాకుండా పోయింది. పథకానికి నమోదు చేసుకున్న రైతుల్లో 33 లక్షల మందికి గతంలో అకౌంట్‌లో పడాల్సిన రూ. రెండు వేలు పడలేదు. అంతకుముందు లబ్ధిదారులతో పోల్చుకుంటే 19 లక్షల మందికి కోత పడింది.ఈ -కెవైసి పూర్తి కాలేదన్న పేరిట డిసెంబర్-మార్చి కిస్తును రైతుల బ్యాంక్ అకౌంట్లలో కేంద్రం జమ చేయలేదు. త్వరలో కేంద్ర బడ్జెట్ వస్తుండగా గడుస్తున్న ఆర్థిక సంవత్సరంలో ఇవ్వాల్సిన మూడవ విడత కూడా జమ కాలేదు. ఈ కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే పీఎం కిసాన్ పథకం కింద నిధులిస్తున్నారు. ఇప్పుడు రిజిస్టరైన లబ్ధిదారుల్లో 70 శాతానికే ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నారు. మిగతా ముప్పై శాతం ఈ కేవైసీ పెండింగ్‌లో ఉండిపోయింది. వారికి రూ. రెండు వేలు నగదు జమ కాలేదు. గత సార్వత్రిక ఎన్నికలకు ముంగిట మోడీ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అంటూ పిఎం కిసాన్‌ను ప్రారంభించింది. ఏడాదిలో మూడు విడతల్లో రూ. 2 వేలు చొప్పున రైతుల అకౌంట్లలో నేరుగా నగదు బదిలీ చేసే పథకమిది. సంవత్సరంలో మూడు విడతలను ఒక్కోదాన్ని నాలుగు మాసాల కింద వర్గీకరించారు. ఏప్రిల్-జులై, ఆగస్టు-నవంబర్, డిసెంబర్-మార్చి. కాగా కేంద్రం విధిస్తున్న షరతులు లక్షలాది మంది రైతులను స్కీంకు దూరం చేస్తున్నాయి. ఏపీలో ప్రతీ ఏటా లబ్దిదారుల సంఖ్య తగ్గిపోతున్నారు. సొంత భూమి యజమానుల కుటుంబానికి మూడు విడతల్లో కేంద్రం ఏడాదికి ఇచ్చేది రూ. 6 వేలు. ఆ స్వల్ప సాయానికీ కేంద్రం రోజుకో షరతు పెడుతోంది. ఎపిలో 60,77,808 మంది పథకానికి నమోదు చేసుకోగా 2022-23లో ఏప్రిల్-జులై మాసాలకు 46,62,768 మందికి జమ పడింది. ఆగస్టు-నవంబర్ కు 27,55,285 మందికే ఇప్పటి వరకు జమ పడింది. రిజిస్టరైన వారిలో సుమారు 33 లక్షల మందికి పడలేదు. ముందటి కిస్తు పడ్డ వారిలో 19 లక్షల మందికి కోత పడింది. అంతకు ముందు లబ్ధిదారుల్లో 20 లక్షల మంది తగ్గారు. ఇంత భారీగా ఎందుకు తగ్గుతారన్నదానిపై స్పష్టత లేదు. ఏపీలో కావాలేన తగ్గిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా వ్యవసాయదారులకు రైతు భరోసా పథకాన్ని పీఎం కిసాన్‌తో కలిపి అమలు చేస్తోంది. రెండు పథకాలకూ కలిపి లబ్ధిదారులను రాష్ట్రమే నిర్ణయిస్తోంది. ఏడాదిలో రైతులకు మూడు విడతల్లో మొత్తం రూ. 13,500 అందాలి. మేలో ఇచ్చే తొలి కిస్తు రూ. 7,500లో రాష్ట్రం 5,500, కేంద్రం 2,000 ఇవ్వాలి. నవంబర్‌లో ఇచ్చే రెండవ కిస్తులో రాష్ట్రం 2 వేలు, కేంద్రం 2 వేలు ఇవ్వాలి. మూడవ కిస్తు 2 వేలనూ కేంద్రమే ఇస్తుంది. అందులో రాష్ట్ర వాటా లేదు. భూమి యజమానులకు రాష్ట్రం ఇచ్చే సాయం పడుతోంది తప్ప కేంద్రం ఇచ్చేది సకాలంలో పడట్లేదు. లక్షలాది మంది రైతులు కేంద్ర సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఇలాంటి రైతులకు ఏపీ ప్రభుత్వం అయినా జమ చేస్తుందా అంటే.. అదీ చేయడం లేదు. దీంతో రైతులు నష్టపోతున్నారు.

## రాజధానిలో సీట్ల లొల్లి

గుంటూరు, ఫిబ్రవరి 1, ఏపీ రాజధాని ప్రాంతం అమరావతిలో రాజకీయం ఆసక్తికరంగా నడుస్తోంది. ఈ ప్రాంతంలో అటు అధికార వైసీపీలో ఇటు ప్రతిపక్షలో టిడిపిలో సైతం సీట్ల విషయంలో పోరు నడుస్తోంది. అమరావతి ప్రాంత పరిధిలో పూర్తిగా ఉన్న తాడికొండ స్థానంలో రెండు పార్టీల్లో ఆధిపత్య పోరు కనిపిస్తోంది. గత ఎన్నికల్లో జగన్ గాలిలో తాడికొండలో వైసీపీ నుంచి ఉండవల్లి శ్రీదేవి గెలిచిన విషయం తెలిసిందే.గెలిచిన తక్కువ రోజుల్లోనే ప్రజా వ్యతిరేకత తెచ్చుకున్న ఎమ్మెల్యేగా శ్రీదేవి నిలబడ్డారు. అందుబాటులో లేకపోవడం, ప్రజా సమస్యలు పట్టించుకోకపోవడం, ముఖ్యంగా రాజధానిని మార్చడం లాంటివి తాడికొండలో వైసీపీకి బాగా నెగిటివ్ అయ్యాయి. మళ్ళీ అక్కడ వైసీపీ గెలవడం చాలా కష్టమనే పరిస్తితి. ఇదే సమయంలో జగన్ వ్యూహాత్మకంగా నెక్స్ట్ సీటు శ్రీదేవికి లేదని చెబుతూ..డొక్కా మాణిక్య వరప్రసాద్‌ని ఇంచార్జ్ గా పెట్టారు. దీంతో శ్రీదేవి వర్గం గోల చేసింది. అయితే తర్వాత కత్తెర సురేశ్‌ని ఇంచార్జ్‌గా పెట్టారు.దీంతో తాడికొండ సీటు కత్తెరదే అని ప్రచారం మొదలైంది. అటు డొక్కా సైతం తాడికొండ సీటుపై ఆశలు పెట్టుకున్నారు.

## తెలుగుదేశం గూటికి కోటంరెడ్డి..?

నెల్లూరు, ఫిబ్రవరి 1, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వైసీపీని వీడి బయటకు వెళ్లిపోతున్నారా..? పార్టీని వీడుతున్నట్టు ఆయన ప్రకటన చేయడానికి ముందే వైసీపీ అక్కడ ఇన్ ఛార్జ్ ని ప్రకటిస్తుందా..? ఈ రెండిటిలో ఏదో ఒకటి ముందు జరుగుతుంది, కానీ ఏది జరుగుతుందో స్పష్టత రావాల్సి ఉంది. అంటే దాదాపుగా కోటంరెడ్డికి వైసీపీతో ముడి వేయలేనంతగా బంధం తెగిపోయింది. తన ఫోన్ కాల్స్ ట్యాప్ చేస్తున్నారనే విషయాన్ని బహిరంగంగానే చెప్పేసిన కోటంరెడ్డి వైసీపీతో తాడో పేడో తేల్చుకోడానికే డిసైడ్ అయినట్లు కనిపిస్తున్నారు. ఆయన ట్యాపింగ్ వార్తలపై అటు అధిష్టానం కూడా సీరియస్ గా ఉన్నట్టు తెలుస్తోంది. గతంలో ఓసారి సీఎం జగన్, ఎమ్మెల్యే కోటంరెడ్డిని వ్యక్తిగతంగా పిలిపించుకుని మాట్లాడినప్పుడే ఈ ట్యాపింగ్ వ్యవహారంపై కోటంరెడ్డికి అనుమానం వచ్చినట్టుంది. రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న వ్యవహారాలన్నిటినీ జగన్ ఆ భేటీలో బయటపెట్టే సరికి ఏదో జరుగుతుందనే డౌట్ కోటంరెడ్డికి వచ్చిందని అంటున్నారు. ఆ తర్వాత కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సోదరుడు గిరిధర్ రెడ్డికి వైసీపీ సేవాదళ్ పదవి రావడంతో అప్పటికి ఆ వివాదం సమసిపోయినట్టయింది. కోటంరెడ్డి కుటుంబానికి జగన్ ప్రాధాన్యత ఇచ్చారని, దీంతో కోటంరెడ్డి కూడా ఇక అసంతృప్తిని పక్కనపెడతారని అనుకున్నారు. కానీ ఆయన వైసీపీలో కుదురుకోలేకపోయారు. మంత్రి పదవి విషయంలోనే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. వైసీపీ హయాంలో నెల్లూరు జిల్లా నుంచి ముగ్గురికి మంత్రి పదవులు వచ్చాయి. తొలి విడత అనిల్ కుమార్ యాదవ్, గౌతమ్ రెడ్డికి మంత్రి పదవులిచ్చారు. మలి విడత కేవలం కాకాణి గోవర్దన్ రెడ్డికి పదవులిచ్చారు. కోటంరెడ్డి కూడా పదవి ఆశించి భంగపడ్డారు. కానీ పార్టీలోనే కొనసాగారు.



ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా వైసీపీకి కాస్త ఎదురుగాలి వీస్తుందన్న వార్తలు కూడా వినిపిస్తున్నాయి. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అధికార పార్టీ ఎమ్మెల్యే అయిఉండి కూడా కొన్ని పనుల్ని కోటంరెడ్డి చేయించుకోలేకపోయారని అంటున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా కూడా పనులు చేయించుకోలేకపోతే ఇక తన పదవికి అర్హత ఏముందని ఆయన భావించారు. అందుకే అధికారులతో పలు సందర్భాల్లో గొడవపడ్డారు. వారిపై ఆరోపణలు కూడా చేశారు. కానీ అధిష్టానం ఈ ఆరోపణల్ని వ్యతిరేకంగా అర్థం చేసుకుంది. ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెడుతున్నారనే కోణంలో కోటంరెడ్డినే టార్గెట్ చేసింది. కోటంరెడ్డి దాదాపుగా పార్టీని వీడిపోతున్నారనే వార్తలకు బలం చేకూరుతోంది. ఈరోజంతా నెల్లూరు రూరల్ వైసీపీ కార్యాలయం వద్ద కార్యకర్తలు, మీడియా హడావిడి నడిచింది. కోటంరెడ్డి రూరల్ నాయకులతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి అభిప్రాయాలు సేకరించారు. పార్టీలో అవమానాలు పడ్డామని వారి వద్ద కోటంరెడ్డి వ్యాఖ్యానించినట్టు తెలుస్తోంది. ఇంకా అవమానాలు పడాలా అని అనుచరుల వద్ద ఆయన ప్రశ్నించారని సమాచారం. ఈ దశలో పార్టీ మారడం ఒక్కటే ఆయన ముందున్న ఏకైక ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. వైసీపీలోనే ఉన్నా కూడా 2024లో ఆయనకు టికెట్ ఇచ్చే అవకాశాలు తక్కువ. అందుకే కోటంరెడ్డి కీలక నిర్ణయం తీసుకుంటారని అంటున్నారు. రాత్రి ఏడు గంటల వరకు కార్యాలయంలోనే ఉన్న ఆయన ఆ తర్వాత ఇంటికి వెళ్లిపోయారు. ఎలాంటి ప్రకటన చేయలేదు. అటు అధిష్టానం కూడా కోటంరెడ్డి వ్యవహారంలో ఏదో ఒకటి తేల్చాయని చూస్తోంది.

ఆయన తమ్ముడు గిరిధర్ రెడ్డికి నెల్లూరు రూరల్ వైసీపీ పగ్గాలు అప్పగించే అవకాశాలున్నట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారంలో నిజమెంతుందో తేలాలి. వ్యాపార రంగంలో ఉన్న గిరిధర్ రెడ్డిని, ఆయన అన్న శ్రీధర్ రెడ్డి రాజకీయాల్లోకి తెచ్చారు. అన్నకు అండగా ఆయన ఉంటున్నారు. రూరల్ వైసీపీ కార్యాలయ ఇన్ చార్జ్ గా ఆయన కొనసాగుతున్నారు. ఇటీవల ఆయనకు పార్టీ కార్యదర్శి పదవి ఇచ్చారు. ఆ తర్వాత సేవాదళ్ అధ్యక్షుడిని చేశారు. ఇప్పుడు ఆయన అన్నవైపు ఉంటారా, లేక జగన్ వైపు ఉంటారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. గిరిధర్ రెడ్డి అన్నబాటలోనే వెళ్తారని ఆయన మనసెరిగినవారు చెబుతున్నారు. అయితే రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే కాబట్టి దేన్నీ ముందుగా అంచనా వేయలేం. ఒకవేళ గిరిధర్ రెడ్డి కాదంటే, ఆనం విజయ్ కుమార్ రెడ్డి అక్కడ వైసీపీకి మరో ఆప్షన్ గా ఉన్నారు. మొత్తమ్మీద కోటంరెడ్డి ఎపిసోడ్ కి ఒకటి లేదా రెండు రోజుల్లో ఫుల్ స్టాప్ పడుతుంది.

## ఫ్యాన్ క్రింద నుంచి బయిటకు ఎవరు...

నెల్లూరు, ఫిబ్రవరి 1, ఏపీలో అధికార వైసీపీలో ఊహించని ట్విస్ట్‌లు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే ప్రతిపక్షాలు ఏకమవుతూ..వైసీపీపై పోరుకు సిద్ధమవుతున్నాయి. అలాగే ప్రజల్లో వైసీపీపై కాస్త వ్యతిరేకత పెరుగుతున్నట్లు కనిపిస్తుంది. ఇలాంటి పరిస్తితుల్లో సొంత పార్టీలో జరిగే ఆధిపత్య పోరు ఇంకా ఇబ్బందిగా మారింది. ఇక ప్రతిపక్ష నేతలు చేసే విమర్శలు వైసీపీకి ఇబ్బందిగా మారుతున్నాయనుకునే లోపు..సొంత పార్టీ ఎమ్మెల్యేలు..తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయి.కేవలం సంక్షేమంపై ఫోకస్ పెట్టడం, అభివృద్ధి లేకపోవడం, ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వకపోవడం, అధికారులు పెద్దగా సహకారం అందించకపోవడంపై ఎమ్మెల్యేల్లో అసంతృప్తి కనిపిస్తుంది. ఇదే క్రమంలో సొంత ప్రభుత్వంపై వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామ్ నారాయణ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన విషయం తెలిసిందే. దీంతో ఆనంకు వైసీపీ అధిష్టానం చెక్ పెట్టింది. వెంకటగిరి బాధ్యతల నుంచి ఆనంని తప్పించి..నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డికి ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆనం వైసీపీకి దూరమయ్యారు.అయితే అదే తరహాలో విమర్శలు చేసిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని మాత్రం జగన్ పిలిపించుకుని మాట్లాడారు. అయినా సరే కోటంరెడ్డి వెనక్కి తగ్గలేదు..తనపై నిఘా పెట్టారని, ఫోన్లు ట్యాప్ చేస్తున్నారని సొంత ప్రభుత్వంపై ఫైర్ అయ్యారు. మూడు నెలల నుంచి తన ఫోన్ ట్యాప్ చేస్తున్నారని, ఈ విషయం తనకు ముందే తెలుసని, రహస్యాలు మాట్లాడుకునేందుకు మరో ఫోన్ ఉందని, 12 సిమ్ లు కూడా ఉన్నాయని తెలిపారు.వైసీపీ అధిష్టానం కొత్త డ్రామాకు తెరలేపిందని, వచ్చే ఎన్నికల్లో గిరిధర్ రెడ్డి వైసీపీ తరపున పోటీ చేస్తే తాను పోటీ చేయబోనని, తమ్ముడికి పోటీగా తాను నిలబడనని, తాను రాజకీయాలకు గుడ్ బై చెబుతానని అన్నారు. తన ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని.. దీంతో తన మనోభావాలు దెబ్బతిన్నాయని, అనుమానం ఉన్న చోట కొనసాగడం కష్టమని అన్నారు.

## హుజురాబాద్ టిక్కెట్ కౌశిక్ కే

కరీంనగర్, ఫిబ్రవరి 1, (న్యూస్ పల్స్)హుజురాబాద్ నుంచి బీఆర్ఎస్ తరుపున పాడి కౌశిక్ రెడ్డిని రంగంలోకి దింపనున్నట్లు హింట్ ఇచ్చారు. సభలో మాట్లాడుతున్న క్రమంలో.. కౌశిక్‌రెడ్డి? ప్రజల్లోనే ఉండి.. గ్రామాల్లోనే తిరుగు.. అక్కడే పడుకో అంటూ వ్యాఖ్యానించారు మంత్రి. అయితే.. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీలోకి దిగిన గెల్లు శ్రీనివాస్ ఓటమిపాలైన విషయం తెలిసిందే. అంతేకాకుండా.. బీఆర్ఎస్ జమ్మికుంట సభకు పూర్తి బాధ్యత తన భుజాలపై వేసుకొని ముందుండి నడిపించారు పాడి కౌశిక్ రెడ్డి. కౌశిక్ రెడ్డికే ఈసారి బీఆర్ఎస్ బీ ఫాం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. స్థానిక ఎమ్మెల్సీతో వెళ్లాలో.. పార్టీ ఇన్?చార్జీతో నడవాలో తెలియక హుజూరాబాద్ బీఆర్ఎస్ క్యాడర్?లో గందరగోళం నెలకొంది. బై ఎలక్షన్స్ లో అధికార పార్టీ అభ్యర్థిగా బరిలోకి దిగి ఈటల రాజేందర్?పై ఓడిపోయిన గెల్లు శ్రీనివాస్ యాదవ్ నియోజవర్గం ఇన్ చార్జిగా కొనసాగుతున్నారు.

# వివాదంలో సోమువీర్రాజు



రాజమండ్రి, ఫిబ్రవరి 1, నిన్నటి వరకు కన్నా లక్ష్మీనారాయణ వ్యవహారం ఏపీ బీజేపీలో హాట్ టాపిక్. బీజేపీ అగ్రనేతల్లో ఒకరైన శివప్రకాష్‌తో కన్నా భేటీ తర్వాత ఆ జోరు చాలా వరకు తగ్గిందని ఊపిరి పీల్చుకుంది ఏపీ శాఖ. ఇప్పుడు కొత్త అంశం దుమారం రేపుతోంది. ఆ మధ్య జాతీయ కార్యవర్గ సమావేశాలకు సోము వీర్రాజు ఢిల్లీ వెళ్లారు. హస్తిన చేరుకోగానే సోము వీర్రాజు తీవ్ర అస్వస్థతకు లోనై.. ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారని సోషల్ మీడియాలో కొందరు పోస్టులు పెట్టారు. దానిని బాగా వైరల్ చేశారు కూడా. ఈ అంశమే బీజేపీలో కలకలం సృష్టిస్తోంది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న బీజేపీ ఏపీ నాయకత్వం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తణుకుకు చెందిన బాలుశ్రీ.. కాకినాడకు చెందిన యార్లగడ్డ రాంకుమార్‌లపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో ప్రస్తావించారు. ఇక్కడో ట్విస్ట్ ఉంది. యార్లగడ్డ రాంకుమార్ బీజేపీ అనుబంధ విభాగం కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గంలో సభ్యుడు. ఇదే కాషాయ పార్టీ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది.బీజేపీకి యార్లగడ్డ రాంకుమార్ చాలాకాలంగా సేవలందిస్తున్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే సోము వీర్రాజు వ్యవహార శైలి.. ఆయన నిర్ణయాలతో రామ్ వివిధ సందర్భాల్లో విభేదించేవారట. బహిరంగంగా కాకున్నా.. పార్టీ నేతల సమక్షంలో తన అభిప్రాయాలను రామ్ కుండబద్దలు కొట్టేవారని సమాచారం. సోము వీర్రాజు తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసేవారట. తాజాగా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అదే రాంకుమార్‌పై ఆరోపణలు చేయడం చూస్తుంటే.. పాత కక్షలను మనసులో పెట్టుకుని ఫిర్యాదు చేశారా? అని బీజేపీలోని ఓ వర్గంలో చర్చ జరుగుతోందట. సొంత పార్టీ వారి మీదే కేసు పెట్టడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారట. సోము వీర్రాజు వర్గం మరో అంశాన్ని చర్చకు పెడుతోంది. రాంకుమార్ బీజేపీ నేతైనా ఆయన మనసు మాత్రం టీడీపీతో ఉందని ఆరోపిస్తున్నారు. టీడీపీతో పొత్తు ఉండబోదని వీర్రాజు చెప్పిన ప్రతీసారీ రాంకుమార్ తెగఇబ్బంది పడిపోయి.. సోషల్ మీడియాలో పార్టీ అధ్యక్షుడిపై వ్యంగ్యంగా కామెంట్స్ చేస్తుంటారని విమర్శిస్తున్నారు. రాంకుమార్‌కు సొంత పార్టీ ప్రయోజనాల కంటే.. పక్క పార్టీ ప్రయోజనాలే ముఖ్యమనేది వీర్రాజు వర్గం చేస్తున్న వాదన. అందుకే రాంకుమార్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయడం చర్చగా మారింది.తాను తప్పుచేశానని భావిస్తే పోలీసులకు ఫిర్యాదు చేసే ముందు తన వివరణ ఎందుకు అడగలేదని రామ్ ప్రశ్నిస్తున్నారు. అయితే ఆయన పేరుతో తప్పుడు ప్రచారం జరుగుతున్నప్పుడు స్వయంగా రామ్ ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదనేది సోము వర్గం కౌంటర్ ఇస్తోంది. ఏపీ బీజేపీలో కొంతకాలంగా జరుగుతున్న ఈ పరిణామాలను చూస్తున్న వారికి చిరాకు పుట్టిస్తోందట. పార్టీలో ఉన్నది పది మంది నేతలైతే.. 20 గొడవలు పెట్టుకుంటున్నారని అసహనం వ్యక్తం చేస్తున్నారట. ప్రతి అంశాన్నీ భూతద్దంలో నుంచి చూడడం సోము వర్గానికి.. సోము వ్యతిరేకవర్గానికి రివాజుగా మారిందంటున్నారు. అసలు బీజేపీని ఏ విధంగా బలోపేతం చేయాలి..? ఏయే కార్యక్రమాలు చేపట్టాలి అనే అంశాల కంటే.. ఈ ఛోటా మోటా అంశాల మీద చిల్లర పంచాయితీలేంటని కొందరు కమలనాథులు గుర్రుగా ఉన్నారట.

## ఫిబ్రవరి 11 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

కర్నూలు, ఫిబ్రవరి 1, ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలం.. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతోంది. ఆంధ్రప్రదేశ్ లోని నంద్యాల జిల్లాలో ఉన్న ఈ పుణ్యక్షేత్రం ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటిగా.. అష్టాదశ శక్తిపీఠాల్లోనూ ఒకటిగా వెలుగులీనుతుంది. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా.. శ్రీశైలంలో ఫిబ్రవరి 11 నుంచి 21 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. దీంతో.. బ్రహ్మోత్సవాల సమయంలో ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఫిబ్రవరి 7 నుంచి 21 వరకు స్వామివారి ఆలయంలో భక్తులకు స్పర్శ దర్శనం రద్దు చేశారు. భక్తులందరికీ అలంకార దర్శనానికి అనుమతించనున్నట్లు కలెక్టర్ మనజీర్ జిలాని వెల్లడించారు. శివస్వాములకు సైతం ఫిబ్రవరి 11 నుంచి 15 వరకు మాత్రమే గర్భాలయ స్పర్శ దర్శనాలకు అనుమతి కల్పించనున్నారు. ఫిబ్రవరి 14న తిరుమల దేవస్థానం తరఫున, 15 న రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా.. సులభంగా ప్రయాణం చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 820 బస్సులను నడపనున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ, టీఎస్ఆర్టీసీ అధికారులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం సుమారు 30 లక్షల లడ్డూలను అందుబాటులో ఉంచనున్నారు. శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సుమారు 8 లక్షల మంది భక్తులు క్షేత్రానికి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. సమావేశం అనంతరం ఆలయం, పరిసరాలు, క్యూలైన్లను జిల్లా కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు.ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా బస్సులు, ఇతర వాహనాలను రింగ్‌రోడ్డు మీదుగా పార్కింగ్ ప్రదేశాలకు మళ్లిస్తారు. ప్రతి కిలో మీటర్‌కు ఒకచోట సత్రాలు, వసతి సముదాయాల వివరాలతో సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. తాగునీటి ఇబ్బందులు కలగకుండా భక్తులకు 30 లక్షల గ్యాలన్ల నీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. ఆలయ మాడవీధులు, క్షేత్ర పరిధిలో చలువ పందిళ్ల ఏర్పాట్లు జరుగుతున్నాయి.



# కాకినాడ రూరల్ లో కొత్త ముఖాలేనా

కాకినాడ, ఫిబ్రవరి 1, కాకినాడ రూరల్ నియోజకవర్గానికి టీడీపీకి ఇన్చార్జి లేరు. ప్రస్తుతం ఉన్న నేతల్లో ఎవరికీ టిక్కు పెట్టడం లేదు అధిష్ఠానం. గత సార్వత్రిక ఎన్నికల తర్వాత వచ్చిన విభేదాల వల్ల పిల్లి ఫ్యామిలీ టీడీపీకి దూరంగా ఉంది. పార్టీ అధినేత జిల్లాకు వచ్చినా కనీసం అటువైపు కూడా చూడలేదు కానీ.. తర్వాత టీడీపీ అధినేతను కలిసి మళ్లీ రూరల్ నియోజకవర్గంలో పిల్లి కుటుంబం తళుక్కుమంది. మాజీ ఎమ్మెల్యేకే ఇంఛార్జ్‌గా పగ్గాలు ఇస్తారని భావించినా.. టీడీపీ కష్టకాలంలో ఉన్నప్పుడు కాడి వదిలేసిన వారిని అందలం ఎలా ఎక్కిస్తారని తెలుగు తమ్ముళ్లు ప్రశ్నించారట. ప్రస్తుతం పార్టీ పిలుపిచ్చిన కార్యక్రమాలు కాకుండా సొంతంగా ప్రొగ్రామ్స్ పెట్టుకుని తిరుగుతున్నారు పిల్లి అనంతలక్ష్మి. మాజీ ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా స్థానిక టీడీపీలో ఓ టీమ్ కూడా పుట్టుకొచ్చింది. ఈ రెండు వర్గాల గొడవలు ఎలా ఉన్నా.. యువతకు ప్రాధాన్యం ఇవ్వాలన్న డిమాండ్ గట్టిగా వినిపిస్తున్న తరుణంలో టీడీపీ నేత కటకంశెట్టి ప్రభాకర్ కార్యక్రమాల స్పీడ్ పెంచడం చర్చగా మారింది. తన సామాజికవర్గం ఓట్లు కూడా ఎక్కువగా ఉండటంతో.. ఛాన్స్ ఇస్తే సత్తా చాటుతానని టీడీపీ అధిష్ఠానానికి సంకేతాలు పంపుతున్నారట ప్రభాకర్.గతంలో మూడుసార్లు టీడీపీ జిల్లా యూత్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు కటకంశెట్టి ప్రభాకర్. ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి. మొదటి నుంచీ టీడీపీలో ఉన్నానని.. పార్టీ గెలిచినా, ఓడినా పసుపు జెండా విడిచి పెట్టలేదనే స్లోగన్‌తో తెలుగు తమ్ముళ్ల దగ్గరకు వెళ్తున్నారట. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి కుటుంబంతో ఉన్న రాజకీయ సాన్నిహిత్యం కూడా కలిసి వస్తుందని చెబుతున్నారట ప్రభాకర్. తనను టీడీపీ ఇంఛార్జ్‌గా ప్రకటించి.. వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇస్తే గెలిచి సత్తా చాటుతామని అంతరంగిక సమావేశాల్లో ప్రభాకర్ వ్యాఖ్యానిస్తున్నారట. ఇప్పటి వరకు శెట్టిబలిజలకు కాకినాడ రూరల్ టికెట్ కేటాయిస్తూ వస్తోంది టీడీపీ. వచ్చే ఎన్నికల్లో మాత్రం కాపు సామాజికవర్గానికి సీటు ఇస్తారని చర్చ సాగుతోంది. పక్కనే ఉన్న రామచంద్రపురం ఇంఛార్జ్‌గా శెట్టిబలిజ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రమణ్యంను ప్రకటించడం? కాకినాడ సిటీ ఇంఛార్జ్‌గా మత్స్యకార సామాజికవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కొండబాబు ఉండటంతో.. రూరల్ సీటు కాపులకే ఇస్తారనే చర్చ ఊపందుకుంది. కటకంశెట్టి ప్రభాకర్ కూడా కాపు సామాజికవర్గానికి చెందిన నాయకుడే కావడంతో కుల సమీకరణాలు కలిసివస్తాయని ప్లస్‌లు మైనస్సులు వేసుకుంటున్నారట.పిల్లి వ్యతిరేకవర్గంలో వాసిరెడ్డి ఏసుదాసు, పేరాబత్తుల రాజశేఖర్, శ్రీనివాసబాబా ఉన్నారు. వీరిలో ఏసుదాసు.. టీడీపీపై విరుచుకుపడే ముద్రగడ అనుచరుడిగా ముద్ర ఉంది. ఇక రాజశేఖర్‌కు నియోజకవర్గంతో సంబంధం లేదనే చర్చ సాగుతోంది. గతంలో ముమ్మిడివరం జడ్పీటీసీ. శ్రీనివాసబాబా గురించి కేడర్‌కే పెద్దగా తెలియదని టీడీపీ వర్గాల టాక్. ఈ సమీకరణాలు.. పరిణామాలు చూశాక.. ప్రభాకర్‌కు ఛాన్సెస్ ఉన్నాయని తెలుగు తమ్ముళ్లు చెవులు కొరుక్కుంటున్నారట. టీడీపీ పెద్దలతో ఉన్న పరిచయాలు ఆయనకు కలిసి వస్తాయనే చర్చ మొదలుపెట్టారు. మరి.. కాకినాడ రూరల్‌పై టీడీపీ అధిష్ఠానం క్లారిటీ ఇస్తుందో లేదో చూడాలి.

# అర్హులందరికీ పోడు భూ పట్టాల పంపిణీకి చర్యలు

**జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా**

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 1 జిల్లాలో అర్హులందరికీ తప్పనిసరిగా పోడు భూముల పట్టాల పంపిణీ చేయాలని, దీనికి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధించిన అధికారులను ఆదేశించారు. పోడు భూముల పట్టాల పంపిణీ పై బుధవారం సంబంధిత అధికారులతో స్థానిక ప్రగతి భవన్ సమావేశ మందిరంలో కలెక్టర్ రివ్యూ నిర్వహించారు. అర్హులందరికీ ఆర్.ఓ.ఎఫ్.ఆర్ చట్టం ప్రకారం పట్టాలు పంపిణీ చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం జిల్లాలలో బృందాలతో సర్వే,గ్రామ సభలు, ఎస్.డి.ఎల్.సి పూర్తి చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.ఫిబ్రవరి మొదటి వారం తరువాత అర్హులకు భూ పట్టా,పాస్ పుస్తకాలు పంపిణీ చేసేందుకు సీఎం కేసీఆర్ నిర్ణయించారని, జిల్లాలో అర్హుల ఎంపిక, వారి దరఖాస్తు ఆమోదం, పాస్ పుస్తకాలు ముద్రణ వంటి పనులు పూర్తి చేసి సన్నద్ధం కావాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలో పోడు భూముల పట్టాల కోసం 7568 మంది గిరిజనులు, 17826 గిరిజనేతరులు ద్వారా మొత్తం. 25394 మంది దరఖాస్తు చేసుకున్నారని, 100% క్షేత్రస్థాయిలో బృందాలతో సర్వే, గ్రామ సభలు పూర్తి చేశామని, ఎస్.డి.ఎల్.సి 689 గిరిజన దరఖాస్తులు సిఫార్సు చేసిందని, ముందస్తుగా వాటిని డి.ఎల్.సి.లో మరోసారి పరిశీలించి, ఆమోదించిన వాటిని ఎస్.ఎల్.సి.కి పంపి పాస్ పుస్తకాలు ముద్రణ కోసం వివరాలు నమోదు కావాలని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలో వచ్చిన 7568 గిరిజనుల దరఖాస్తులో క్షేత్రస్థాయి పరిశీలన సమయంలో 3400 దరఖాస్తులు ఫీల్డ్ లో ఉన్నట్లు గుర్తించామని, వాటిలో 689 ఆమోదించామని, మిగిలిన దరఖాస్తులను మరోసారి పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు.ఆర్.ఒ.ఎఫ్.ఆర్. చట్టం ప్రకారం 2005 కంటే ముందు నుంచి ఉన్న గిరిజనులకు పట్టాలు పంపిణీ చేయాలని, దరఖాస్తులు పరిశీలించే సమయంలో అంతకు ముందు నుంచి భూమి సాగు ఉన్నట్లు 2 ఆధారాలు సమర్పిస్తే వెంటనే ఆమోదించాలని, ఈ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలో వచ్చిన ఏ ఒక్క దరఖాస్తును ఇప్పటి వరకు తిరస్కరించలేదని, సుప్రీం కోర్టు మార్గదర్శకాలను పాటిస్తూ తిరస్కరించే దరఖాస్తులకు కారణాలను స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో అర్హత ఉన్న ఏ ఒక్కరూ నష్టపోవద్దని, అదే సమయంలో అనర్హులబీ దరఖాస్తులు ఆమోదించివద్దని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు టి.ఎస్.దివాకర, డి.ఎఫ్.ఓ. బి.లావణ్య, ఆర్.డి.ఓ. శ్రీనివాస్, అన్ని మండలాల తహసీల్దార్ లు, ఎం.పి.డి.ఓ.లు, ఎఫ్.ఆర్.ఓ.లు., ఎం.పి.ఓ.లు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయండి

పత్తికొండ అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి నజీర్ పిలుపునిచ్చారు. పత్తికొండ చదువుల రామయ్య భవనం నందు మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



దేశంలో ఎక్కడలేని విధంగా నూతన జాతీయ విద్యా విధానం 2020 ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రవేశపెట్టడాన్ని ఏఐఎస్ఎఫ్ గా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎయిడెడ్ పాఠశాలలు ప్రైవేట్ పరం చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినటువంటి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన వసతి దీవెన అమ్మ ఒడి వివిధ రకాల పేర్లతో విద్యార్థులను విద్యార్థులు తల్లిదండ్రులను ఆకట్టుకుని సంవత్సరం గడవకముందే ఆ పథకాలలో కోత విధిస్తామని చెప్పడాన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పు పట్టారు. పూటకు ఒక మాట మాట్లాడుతున్నటువంటి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని విద్యార్థుల పథకాలను ఎత్తివేస్తే భవిష్యత్తులో మీ ప్రభుత్వం కొట్టుకొని పోయే పరిస్థితి ఉంటుందన్నారు. గతంలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెడితే దానిని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రద్దుచేసి విద్యార్థులకు శాపంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్, మండల సహాయ కార్యదర్శి మా భాష, ఏఐఎస్ఎఫ్ నాయకులు మహేష్, రాజు, రమేష్, విష్ణు, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు

# కోర్టు వివాదంలో ఉన్న హోటల్ పై దాడులు అమానుషం



**.-ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి.**

నెల్లూరు,.హైకోర్టులోను, జిల్లా కోర్టులోను వివాదాస్పదంగా ఉన్న హోటల్ వెంకటరమణపై ఇటువంటి అధికారిక సంబంధంలేని మెట్రో లైఫ్ స్టైల్ డెవలపర్స్ డైరెక్టర్ల ముసుగులో సోమవారం దాడికి పాల్పడడం అమానోసమని ఏపీ హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టులో క్రిమినల్ కేస్, నెల్లూరు కోర్టులో దావా ఇంజక్షన్ నడుస్తున్న నేపథ్యంలో హోటల్ వెంకటరమణ నిర్వహిస్తున్న స్థలం తమకు సంబంధించినదని అన్యాయంగా హోటల్లోకి ప్రవేశించి హోటల్ యాజమాన్యాన్ని కొట్టి ఫర్నిచర్ ను ధ్వంసం చేయడమే కాకుండా హోటల్లో ఉన్న ఆహార పదార్థాలను సైతం ధ్వంసం చేసిన మెట్రో లైఫ్ స్టైల్ డెవలపర్స్ డైరెక్టర్ ఓగు నాగేశ్వరరావు మరియు అతని అనుచరులపై పోలీసు యంత్రాంగం తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హోటల్లోకి అక్రమంగా ప్రవేశించిన వారిలో పోలీస్ రంగ ప్రవేశంతో ఫలాయానం చిత్తగించిన వారు కాకుండా పోలీసులకు దొరికిన వ్యక్తులను కూడా పోలీసులు విచారించకుండా వదిలేయడం అన్యాయం అన్నారు. 14 కంపెనీలకు అధిపతి ప్రముఖ విద్యా పారిశ్రామికవేత్త వంకి పెంచలయ్య సూచనలు సలహాలతో ఆయన సమీప బంధువైన ఓగు నాగేశ్వరరావు అతని మిత్రబృందం హోటల్ వెంకటరమణ పై అమానుష దాడులు అన్యాయం అన్నారు. ఇప్పటికీ నెల్లూరులో కానీ విని విరగని రీతిలో హోటల్ యాజమాన్యాలపై దాడులకు పాల్పడిన విష సంస్కృతి ఇదే తొలిసారి అని అన్నారు. ఇటువంటి దాడులు మరోసారి పునరావృతం అయితే చూస్తూ ఊరుకునేది లేదని తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. ఈ సందర్భంగా హోటల్ వెంకటరమణ అధినేత వీరిశెట్టి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ తాను 2014లో మెట్రో లైఫ్ స్టైల్ డెవలపర్స్ వద్ద కొని రిజిస్టర్ చేసుకోవడం జరిగిందన్నారు. అప్పటినుండి ఎన్ని సంవత్సరాలుగా టోటల్ వ్యాపార లావాదేవీలు యధావిధిగా సాగుతున్నాయిన్నారు. ఈ క్రమంలో తాము కొన్నట్లుగా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి 4 యంకణాలలో ఉన్న హోటల్లో అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# జగనన్న ఆదేశిస్తే నెల్లూరు రూరల్ నుండి పోటీకి సిద్ధం.

**బొడ్డుమళ్ళ విష్ణువర్ధన్ రెడ్డి.**

నెల్లూరు.,( ఫిబ్రవరి 1 బుధవారం). ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశిస్తే నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుండి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని బొడ్డుమళ్ళ విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని స్థానిక ప్రెస్ క్లబ్లో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు రూరల్ వై.ఎస్.ఆర్ కాంగ్రెస్పార్టీ బూత్ కమిటీల ఇన్చార్జి కాలం చాలా గొప్పదని తెలిపారు. బలహీనుడు మీద బలవంతుడు బలం ప్రదర్శించినప్పుడు బలహీనుడు ఏమీ చేయలేనప్పుడు ,ఆ బలహీనుడికి తోడుగా కాలం నిలబడి 100 రెట్లు పగ తీర్చుకుంటుందన్నారు. మనుషులు కొట్టే దెబ్బకన్నా, కాలం కొట్టే దెబ్బ గూబ గుయ్యమంటుందిని స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై. యస్. జగన్మోహన్రెడ్డికి శిరస్సు వంచి, సవినయముగా నమస్కరించుకుంటున్నానని అన్నారు. ఓదార్పుయాత్ర నుంచి గత 13 సంIIలుగా జగన్నన్న ఇష్టంతో నడిచానని తెలిపారు. గత 13 సంII నెల్లూరు రూరల్ రాజకీయాలలో క్రియాశీలంగా వ్యవహరించానకని తెలియజేశారు. నెల్లూరు రూరల్లో అణువణువు తెలిసినవాడినని అన్నారు. నెల్లూరు రాజకీయాలలో అంతర్గత విషయాలు తెలిసినవాడినిని పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 1వ బూత్ గొల్లకందుకూరు నుంచి చివరి బూత్ వరకు ఎక్కడా ఏ ఏ ప్రాంతంలో, ఎక్కడ ఏ ఏ డివిజన్లలో, ఎక్కడ ఏ ఏ గ్రామాలలో, ఏ ఏ బూతులు వస్తాయో క్విజ్ ఫోటీ పెట్టినా, నిద్రలో లేపి అడిగినా చెప్పగలనని తెలియజేశారు. రాజకీయాలలో నాయకుల కదలికలను క్షుణ్ణంగా గుర్తించగలనని అన్నారు. రూరల్లో ఉండే అన్ని నాయకుల గురించి ప్రతి విషయం తెలిసినవాడినని గుర్తు చేస్తారు. ఇకపోతే వై.యస్.ఆర్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, రూరల్ ప్రజలకు, నోట్లో నాలుకలా ఉన్నవాడినని అన్నారు.అర్ధరాత్రి ఫోన్ చేసినా వాళ్ళ సమస్యలకు వెంటనే స్పందించాను. నెల్లూరు రూరల్కి ఒక మంచి కాపలాదారుడిగా అందరి మన్ననలు పొందినవాడిని.

# సత్తెనపల్లిలో అగ్ని ప్రమాదం

పల్నాడు పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఎన్బువో హోమ్ సెంటర్ లో అగ్ని ప్రమాదం జరిగింది. శ్రీ వైష్ణవి ఆటో మొబైల్ దుకాణం లో విద్యుత్ షార్ట్ షార్కుట్ తో మంటలు చెలరేగాయి. బైకులకు సంబంధించిన స్పేర్ పార్ట్స్ పూర్తిగా దగ్ధం అయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలార్పారు. ఘటనలో దాదాపు 10 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు సమాచారం.

# వణుకుతున్న వైకాపా

**అచ్చెన్నాయుడు**

టెక్కలి జాతీయ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు చేపడుతున్న యువగళం పాదయాత్ర వైకాపా వెన్నులో వణుకు పుట్టిస్తోందని రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు, ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం టెక్కలి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి 2019 తన ఎన్నికల హామీల్లో యువతకు పెద్దపీట చేస్తానని నమ్మించి గద్దెనెక్కిన తరువాత నిరుద్యోగ యువతను వంచించడంతో వారంతా తీవ్ర నిరాశ, నిస్పృహలో ఉన్నారన్నారు. యువతకు భరోసా కల్పించేందుకు ఈనెల 27న ప్రారంభమైన యాత్రను చూసి జగన్మోహన్ రెడ్డి సైకోలా మారి రాష్ట్ర ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తున్నాడని అన్నారు. నెంబర్ ఒకటిని ప్రవేశపెట్టి పాదయాత్రను అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నా డని మండిపడ్డారు. లోకేష్ బాబుకు భద్రత కల్పించడంలో పోలీసులపై తాను చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనుకకు తీసుకున్నానని వివరించారు. పాదయాత్రలో తెలుసుకున్న సమస్యలు తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి టీడీపీ విజయం సాధించే దిశగా ముందుకు సాగుతామన్నారు.

# భైరెడ్డిపల్లిలో ఉద్రిక్తత

పలమనేరు చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం భైరెడ్డిపల్లిలో ఉద్రిక్తత నెలకొంది. లోకేష్ పాదయాత్ర ముగిశాక బ్యానర్ల గొడవ మొదలయింది. గుర్తు తెలియని దుండగులు ఇండియన్ బ్యాంక్ ఎదురుగా టిడిపి శ్రేణుల బ్యానర్లను తగలబెట్టారు. విషయం తెలుసుకొని టిడిపి నేతలు భైరెడ్డిపల్లి చేరుకునేసరికి దుండగులు పరారయ్యారు. ఇది పక్కా వైసీపీ నాయకుల పనే అని టిడిపి శ్రేణులు అంటున్నాయి. పోలీస్ స్టేషన్ కు కూతవేటు దూరంలో ఈ తతంగం అంతా జరిగిన పోలీసులు ఏం చేస్తున్నారని నేతలు అంటున్నారు. తెలుగుదేశం పార్టీ పట్ల పెరుగుతున్న జనాదరణ ఓర్వలేకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని భైరెడ్డిపల్లి టిడిపి ప్రెసిడెంట్ కిషోర్ గౌడ అన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి హేయమైన చర్యలకు పాల్పడుతున్నారని తీవ్ర విమర్శలు చేసారు. ఎన్ని రకాలుగా ప్రయత్నించినా 2024 లో రాబోయేది తెలుగుదేశం పార్టీనే, బ్యానర్లను చింపగలరేమో గాని ప్రజల్లో పార్టీ పట్ల ఉన్న అభిమానాన్ని చెరపలేరని వైసిపి నాయకులకు సవాల్ విసిరారు.

# శ్రీవారి సేవలో మెహ్రీన్ కౌర్ పిర్జాదా

తిరుమల తిరుమల శ్రీవారిని పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు.. బుధవారం ఉదయం స్వామి వారి నైవేద్య విరామ సమయంలో సినీ నటి మెహ్రీన్ కౌర్ పిర్జాదా, కమెడియన్ సుడిగాలి సుధీర్ లు వేర్వేరుగా స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.. దర్శనంతరం వీరికి రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా, ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.. ఆలయ బయటకు వచ్చిన మెహ్రీన్ కౌర్ పిర్జాదా తో సెల్ఫీలు దిగేందుకు భక్తులు ఆశక్తి చూపారు..


# ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయండి

పత్తికొండ అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా నిర్మాణ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి నజీర్ పిలుపునిచ్చారు. పత్తికొండ చదువుల రామయ్య భవనం నందు మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా నూతన జాతీయ విద్యా విధానం 2020 ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రవేశపెట్టడాన్ని ఏఐఎస్ఎఫ్ గా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎయిడెడ్ పాఠశాలలు ప్రైవేట్ పరం చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినటువంటి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన వసతి దీవెన అమ్మ ఒడి వివిధ రకాల పేర్లతో విద్యార్థులను విద్యార్థులు తల్లిదండ్రులను ఆకట్టుకుని సంవత్సరం గడవకముందే ఆ పథకాలలో కోత విధిస్తామని చెప్పడాన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పు పట్టారు. పూటకు ఒక మాట మాట్లాడుతున్నటువంటి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని విద్యార్థుల పథకాలను ఎత్తివేస్తే భవిష్యత్తులో మీ ప్రభుత్వం కొట్టుకొని పోయే పరిస్థితి ఉంటుందన్నారు. గతంలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెడితే దానిని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రద్దుచేసి విద్యార్థులకు శాపంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు మోహన్, మండల సహాయ కార్యదర్శి మా భాష, ఏఐఎస్ఎఫ్ నాయకులు మహేష్, రాజు, రమేష్, విష్ణు, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు

# దిశా యాప్ పై అవగాహన

బద్వేలు , జిల్లా ఎస్పీ సి.ఐ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు బద్వేలు పట్టణ వార్డు సచివాలయ మహిళా పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ పీ.జి కళాశాల ఎన్.యస్.యస్ విద్యార్థులకు దిశా యాప్ తదితర అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయబడినది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన బద్వేలు అర్బన్ యస్.ఐ శ్రీకాంత్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తులో యువత ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. దిశ యాప్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈవ్ – టీజింగ్, సైబర్ క్రైమ్, నకిలీ ఋణ ఆఫర్స్, నకిలీ ఉద్యోగాలు, వ్యక్తిగత భద్రత తదితర అంశాలపై కొన్ని ఉదాహరణల ద్వారా విద్యార్థులకు చక్కటి అవగాహన కల్గించారు. సచివాలయ మహిళా పోలీసులు విద్యార్థులకు పోలీసులకు మధ్య వారధిలా ఉంటారన్నారుకళాశాల పరిపాలనాధికారి ఉ మున్సిపల్ వైస్ చైర్మన్ రాచపూడి వెంకట సాయి కృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకురావడం గర్వించదగ్గ విషయమన్నారు. అందులో మహిళా పోలీసులను నియమించి వారి ద్వారా విద్యార్థినుల భద్రతను పర్యవేక్షించడం ప్రశంసనీయమన్నారు. పోలీస్ వారి సేవను కొనియాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు.సచివాలయ మహిళా పోలీసులు మాట్లాడుతూ.. నకిలీ రుణ యాప్స్, దిశ యాప్, ర్యాగింగ్, తదితర వాటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థినులు ఏవైనా సమస్యలు ఉన్నయెడల రక్షణ కొరకు వెంటనే సైబర్ క్రైమ్ నెంబర్ 1930,1098,100 నంబర్లకు ఫోన్ చేయవచ్చునన్నారు. ప్రభుత్వ చట్టాలపై పరిసరాలలో కూడా అవగాహన కలిగించాలన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి మునిసిపల్ వైస్ చైర్మన్ రాచపూడి వెంకట సాయి కృష్ణ, ప్రిన్సిపల్ సత్యనారాయణ, బద్వేలు అర్బన్ యస్.ఐ శ్రీకాంత్, కళాశాల అధ్యాపక బృందం, సచివాయ వార్డు మహిళా పోలీసులు మీనా, తేజస్విని, శ్రీలక్ష్మి ,ప్రశాంతి,మల్లేశ్వరి, లక్ష్మి, వరలక్ష్మి, వసుధ ఎన్.యస్.యస్ విద్యార్థులు పాల్గొన్నారు.





# విశాఖకు రాజధాని మార్పు సాధ్యమా...

విశాఖపట్టణం, ఫిబ్రవరి 1,ఢిల్లీ వేదికగా సీఎం జగన్ ఆంధ్రప్రదేశ్ రాజధాని విశాఖపట్టణం అని, త్వరలోనే తాను కూడా అక్కడకు షిఫ్ట్ అవుతున్నానని ప్రకటించారు. అయితే ఈ అంశంపై తెలుగు రాష్ట్రాల్లో చర్చ మొదలైంది. వరుసగా పార్టీ నేతల్లో చర్చ మొదలైంది. అది అలా అయితే ఇది ఎలా...అబ్బే అది సాధ్యం కాదంటూ, కాదు సాధ్యమేనంటూ ఎవరికి వారు వాదనలు మొదలుపెట్టేశారు. ఆ విషయాలు ఏంటంటే... విశాఖపట్టణం రాజధాని అని సీఎం జగన్ ప్రకటించారు. ఆయన చెప్పాక ఇంకెవరు ఏం మాట్లాడతారు. అదే జరుగుతుందని కొందరు నేతలు అంటుంటే, ఇదే సమయంలో ఎవరి వాదనలు వారు వినిపిస్తున్నారు. రాజధానికి వెళ్లాలంటే, అంతకు ముందు జరగాల్సిన వ్యవహారాలు అన్నీ ఆశామాషీ కాదు కదా అని ప్రశ్నిస్తున్నారు. దీనికి కొందరు అవును అంటూనే, ముఖ్యమంత్రి రేంజ్ లో జగన్ వెళ్లి విశాఖపట్టణంలో కుర్చుంటే, మిగిలినవి వాతంతట అవే వస్తాయంటూ, పార్టీ నేతలు కొందరు ధీమాగా చెబుతున్నారు. అయితే కొందరు ఈ విషయానికి నిజమే అంటూనే అంత ఈజీనా అంటూ సందేహాన్ని కూడా వెలిబుచ్చుతున్నారు. సచివాలయం, అందులోని హెచ్ఓడీలు, వివిధ శాఖలు, దిగువ స్థాయి అధికారులు, సిబ్బంది, ఇలా అందరూ తట్టాబుట్టా సర్దుకొని, బెజవాడ నుంచి విశాఖపట్టణానికి వెళ్లటమా..అంటూ ఊహల్లోకి వెళుతున్నారు. రాజధాని ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి వెళ్లడం పెద్ద ప్రాసెస్.. ఎన్నికల ముందు సీఎం ఈ ప్రాసెస్ ను అమలుచేయటం అంత ఈజీనా అంటూ కొందరు అధికారులు సైతం, తమను కలిసిన పార్టీ ముఖ్య నేతల వద్ద సందేహాలు చెబుతున్నారంట. రాజధాని తరలింపు వ్యవహారంపై ప్రభుత్వ వర్గాలు అప్పుడు ఇప్పుడూ అంటూ రోజులను గుర్తు చేసుకుంటున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత 2014లో హైదరాబాద్ నుంచి విజయవాడకు షిఫ్ట్ అవ్వటానికి జరిగిన ప్రయత్నాలు గురించి ఆలోచిస్తున్నారు. అప్పట్లోనే అత్యంత క్లిష్టంగా హైదరాబాద్ నుంచి విజయవాడకు వచ్చారు. విజయవాడలో తాత్కాలిక కార్యాలయాలు, అద్దెకు ఇళ్ళు వెతుక్కున్నారు. అదే సమయంలో అమాంతంహా పెరిగిన ఇళ్ల అద్దెలు, అప్పటి సీఎం చంద్రబాబు ఇంటి అద్దెల పెంపుపై ఆగ్రహం వ్యక్తం చేయటం...ఇలాంటి పదనిసలు అన్నీ ఇప్పుడు మరోసారి గుర్తుకు వస్తున్నాయి. సీఎంగా ఉన్న వ్యక్తి రాజధాని అంటూ విశాఖపట్టణానికి వెళ్లి అక్కడ నుంచి పని చేయటానికి ముందు కూడా కొన్నిసదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. ప్రధానంగా సీఎంవో అధికారులకు ఏర్పాట్లు జరగాలి, ఆ తరువాత సీఎంకు ప్రత్యేక సదుపాయాలు, భద్రత వంటి అంశాలు అత్యంత కీలకం.. ఇదే సమయంలో దేశ విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులు, వారికి అందాల్సిన సదుపాయాలు, ప్రోటోకాల్, వంటి తతంగాలు, అంతర్జాతీయ స్థాయిలో మన రాష్ట్రాన్ని గుర్తించే విధంగా వాతావరణం ఏర్పాటు చేయటం...ఇలా ప్రతిది సవాలే. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఆంధ్రప్రదేశ్ రాజధాని మార్పు చేసిన సమయంలో చాలా మంది ఉద్యోగులు, విజయవాడకు వచ్చారు కాని, వారి మనస్సులు మాత్రం ఇప్పటికి హైదరాబాద్ చుట్టూనే తిరుగుతున్నాయి. వీకెండ్ వచ్చిందంటే చాలు, ఆంధ్రప్రదేశ్ సచివాలయం పూర్తిగా బోసిబోతుంది. అధికారులు అంతా హైదరాబాద్ కు వెళ్ళిపోతారు. అక్కడ వాతావరణానికి ,విజయవాడ లో వాతావరణానికి చాలా వ్యత్యాసం ఉండటం కూడా ఇందుకు ప్రధాన కారణమని అంటుంటారు. ఇలాంటి పరిస్థితులు చాలా వెంటాడుతున్న సమయలో ఇప్పుడు మరోసారి విశాఖపట్టణానికి రాజధాని అని జగన్ చేసిన కామెంట్స్ తో ఏపీ ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది.

# పాత పెన్షన్ పునరుద్ధరణకై ధర్మస్థలిలో జరిగే సంకల్ప దీక్షను జయప్రదం చేయాలి

**- జిల్లా అధ్యక్షుడు జె యల్లప్ప సమావే.శం**

ఎమ్మిగనూరు పట్టణంలో ఫిబ్రవరి 1 బుధవారం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు జె యల్లప్ప మాట్లాడుతూ పాత పెన్షన్ పునరుద్దరణకై విజయవాడ ఏలూరు హైవేలో గన్నవరం దగ్గర ధర్మస్థలిలో జరిగే సంకల్ప దీక్షలు జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె యల్లప్ప డిమాండ్ చేశారు. బుధవారం సంకల్ప దీక్షలు పోస్టర్ ను ప్రాంతీయకార్యాలయంలో ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల, ఉపాధ్యాయులు జీవిత భద్రతకు మచ్చగా పరిణమిస్తున్న కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానం రూపొందిస్తామని ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేర్చక పోగా ఇప్పుడు మరో కొత్త పెన్షన్ విధానం గ్యారేంటెడ్ పెన్షన్ విధానం జిపిఎస్ అమలు చేస్తామని ప్రతిపాదించడం ఉద్యోగుల ఉపాధ్యాయులు ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని పాత పెన్షన్ విధానమే అమలు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి యస్.దావీదు మాట్లాడుతూప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గ్యారెంటీ పెన్షన్ విధానం వల్ల సిపిఎస్ విధానంలో కంటే కొద్దిపాటి ప్రయోజనాలు అదనంగా చేసినప్పటికీ అది ఉద్యోగుల పదవీ విరమణ అనంతరం భద్రత కల్పించేదిగా లేదని ఈ విధానం కూడా కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానానికి మరొక ప్రతిరూపమే తప్ప మరోటి కాదని ,రెగ్యులర్ ఉద్యోగాలు కల్పన తగ్గిపోతున్న కొలది పాత పెన్షన్ విధానం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై పెద్దగా భారం పడే భారం కూడా లేదని అన్నారు.రాష్ట్ర కౌన్సిలర్ మల్లారి నాగరాజు సందర్భంగా మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మొదటి నుండి పాత పెన్షన్ విధానమే కొనసాగిస్తుండగా రాజస్థాన్, ఛత్తీస్గడ్, జార్ఖండ్, పంజాబ్ రాష్ట్రాలు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాయని సందర్భంగా చెప్పారు. జిల్లా అడిట్ కమిటీ సభ్యులు డి.కౌలన్న మాట్లాడుతూ ఇటీవల ఏర్పడిన హిమాచల్ ప్రదేశ్ నూతన ప్రభుత్వం కూడా పాత పెన్షన్ విధానం వనరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకున్నదని మన పొరుగును ఉన్న తమిళనాడు రాష్ట్రం కూడా 2023 ఏప్రిల్ 21 నుండి పాత పెన్షన్ విధానానికి వస్తుంది. ఈ నేపథ్యంలో గ్యారంటెడ్ పెన్షన్ విధానం ఆలోచన విరమించుకోవాలని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరుతూ ఫిబ్రవరి 3న ఆంధ్రప్రదేశ్ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా గన్నవరం సమీపంలో ధర్మస్థలి ప్రాంగణంలో సంకల్ప దీక్ష సభను నిర్వహించడం జరుగుతున్నదని ఈ సభకు పలువురు మంత్రులు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల జాతీయ ,రాష్ట్ర నాయకులు ఆహ్వానించడం జరుగుతున్నదని చెప్పారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి పాత పెన్షన్ ఉపసంహరించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్యోపాధ్యాయ ఫెడరేషన్ డిమాండ్ చేస్తున్నదని , సంకల్ప దీక్ష సభకు పెద్ద ఎత్తున ఉద్యోగులు , ఉపాధ్యాయులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరడం జరిగింది, ఈకార్యక్రమంలో వై.రామాంజనేయులు, చంద్రపాల్, ప్రసాద్,యం.రాజు, కె.భాగ్యరాజు, సుధాకర్, బాబు,శంకర్ నాయక్, నాగేశ్వరరావు, పాపయ్య తదితరులుపాల్గొన్నారు.

# చిరుధాన్యాల సాగును పెంచండి.



బద్వేలు అంతర్జాతీయ చిరుధాన్య సంవత్సరంగా 2023 నిర్దేశించబడినది ,అందులో భాగంగా బేతాయపల్లి పంచాయతీ నందు వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం. నాగరాజ వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.చిరుధాన్యాలను ప్రతిరోజు ఆహారం లో భాగంగా చేసుకోవాలని తద్వారా పోష్టిక ఆహార లోపాన్ని అధిగమించవచ్చని తెలియజేశారు. మామూలు వాటి కన్నా చిరుధాన్యాలలో అత్యధిక పోషకాలు ఉంటాయని ఉదాహరణకి వరిగలో 12.5 ప్రోటీన్ శాతం, ఫైబర్ మరియు లవణాలు అత్యధికంగా ఉన్న ఊద 10.1, సజ్జలో 16.9 గ్రాముల ఐరన్, జొన్నలో 54 ఎణ కాల్షియం కలిగి ఉన్నాయని వాటిని తినడం ద్వారా సూక్ష్మ పోషకాలు లోపాలను మరియు ఇతర వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయని తెలియజేశారు.పూర్వీకులు సాగు చేసి చేసే కొర్రలు, సామలు, వరిగలు తదితర చిరుధాన్యాలు సాగు విస్తీర్ణాన్ని ప్రతి ఏటా పెంచాలని రైతులను, అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హరినారాయణ, మండల వ్యవసాయ అధికారి బి అరవింద నాయక్, గ్రామ సర్పంచ్, వెంకటసుబ్బారెడ్డి గారు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రాలయం టిడిపి ఇన్చార్జి తిక్క రెడ్డి మనముడు నామకరణ నాకు హాజరైన మాజీ కేంద్ర మంత్రివర్యులు

ఎమ్మిగనూరు పట్టణంలో ఫిబ్రవరి 1 బుధవారం నాడు శ్రీ వాసవి కళ్యాణ మండపం నందు తెలుగుదేశం పార్టీ మంత్రాలయం నియోజకవర్గం ఇంచార్జ్ పాలకుర్తి తిక్కా రెడ్డి గారి మనవడు "గౌతమి విఖ్యాత్" నామకరణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు ×కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ ×కోట్ల సుజాతమ్మలు హాజరయ్యారు. తిక్కారెడ్డి మనవడు గౌతమి విఖ్యాత్ ను కోట్ల దంపతులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కోట్ల వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, ఎమ్మిగనూరు నియోజకవర్గ టిడిపి నాయకులు ఆరవీటి సుధాకర్ శెట్టి, బనవాసి ఆదినారాయణ రెడ్డి,కదిరికోట ఆదెన్న, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ జి. అల్తాఫ్, అడ్వకేట్ కేటి మల్లికార్జున, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మాచాని శివకుమార్, సోమల గూడూరు కమలనాభ రెడ్డి, శివ టాకీస్ నారాయణరెడ్డి, ఎమ్మిగనూరు మండలం మాజీ ఆత్మ చైర్మన్ కందనాతి శ్రీనివాసులు,అల్వాల సర్పంచ్ డాక్టర్ భాష, రాయచోటి సుధాకర్ రెడ్డి, కె. తిమ్మాపురం కురుమన్న, కడివెల్ల లింగన్న, గంజహల్లి లక్ష్మన్న, పెద్ద మరి వీడు మాజీ సర్పంచ్ దస్తగిరి, గుడికల్ నాగరాజు, తెలుగు మహిళా నాయకురాలు గోకరమ్మ, వెంకటాపురం బుడ్డన్న, ముస్లిం మైనార్టీ నాయకులు కె.యం.డి.జబ్బార్, వలి భాష టిడిపి యస్.సి.సెల్ నాయకులు రోజా ఆర్ట్స్ ఉసేని తదితరులు ఉన్నారు.

# పట్టుబట్టి సాధించిన దిల్ రాజు



మహేష్ బాబుకు దిల్ రాజుకు చెడినట్లుగా గత ఏడాది ఒక టైంలో కొంచెం గట్టిగానే ప్రచారం జరిగింది. 'సర్కారు వారి పాట' వసూళ్ల గురించి నిర్మాతలు ప్రకటిస్తున్న నంబర్లు ఫేక్ అనే అర్థం వచ్చేలా పరోక్షంగా దిల్ రాజు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఈ కామెంట్ల విషయంలో హర్టయిన మహేష్ బాబు.. దిల్ రాజును దూరం పెట్టారని తన తర్వాతి సినిమా నైజాం హక్కులు రాజుకు ఇవ్వకూడదని కండిషన్ పెట్టారని జోరుగా వార్తలు వచ్చాయి అప్పట్లో.ఐతే ఈ వ్యవహారం గు?రంచి ఈ మధ్య ఓ ఇంటర్వ్యూలో దిల్ రాజు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మహేష్ బాబుకు ఎవరో ఏదో చెబితే అపార్థం చేసుకుని ఉండొచ్చు అంటూనే.. ఒకవేళ మహేష్ కొత్త సినిమాను నేనే నైజాంలో రిలీజ్ చేస్తే అప్పుడేమంటారు? నేను ఫ్యాన్సీ రేటు ఇస్తే నిర్మాతలు కాదంటారా? అంటూ ఆయన ప్రశ్నించారు.ఐతే అప్పుడు రాజు ఏమీ మాట వరసకు ఆ మాట అనలేదని స్పష్టమవుతోంది. పట్టుబట్టి మహేష్ కొత్త సినిమా నైజాం హక్కులను ఆయన సొంతం చేసుకున్నాడన్నది తాజా కబురు. హారిక హాసిని క్రియేషన్స్ బేనర్లో త్రివిక్రమ్ దర్శకుడిగా రూపొందుతున్న మహేష్ కొత్త సినిమా నైజాం హక్కులను దిల్ రాజు ముందు అన్నట్లే ఫ్యాన్సీ రేటుకు దక్కించుకున్నాడట.మహేష్ కెరీర్లో ఏ చిత్రానికీ లేని విధంగా ఏకంగా రూ.50 కోట్ల రేటు ఆఫర్ చేయడంతో నిర్మాతలు మరో ఆలోచన లేకుండా ఆయనకు రైట్స్ ఇచ్చేసినట్లు సమాచారం. ఐతే ఈ విషయంలో ఇది జరగడానికి ముందే మహేష్తో రాజుకు ప్యాచప్ అయిందని.. నిర్మాతలు ఈ విషయాన్ని మహేష్కు కమ్యూనికేట్ చేశాకే డీల్ పూర్తయిందని తెలుస్తోంది. మొత్తానికి ఆ రోజు సవాల్ చేసినట్లుగానే మహేష్ సినిమాను ఫ్యాన్సీ రేటుకు దిల్ రాజు సొంతం చేసుకున్నాడన్న వార్త ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది.

# దసరాతో నాని మెగా హీరోల ఇమేజ్ అందుకుంటాడా?



నేచురల్ స్టార్ నాని పెర్ఫార్మెన్స్ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఎలాంటి కథ దొరికిన అందులో పాత్ర తీరు ఏ విధంగా ఉన్నా దానికి తగ్గట్లుగా తనని తాను మార్చేసుకొని క్యారెక్టర్ లో పరకాయ ప్రవేశం చేయడం నాని స్టైల్. ఇప్పటి వరకు నాని కెరియర్ లో వచ్చిన ప్రతి సినిమా అతన్ని ఒక్కో మెట్టు ఎక్కిస్తూ వచ్చింది. శ్యామ్ సింగరాయ్ సినిమాతో నాని తనని మరో లెవల్ లో రిప్రజెంట్ చేసుకున్నాడు. సినిమా ఫ్లాప్ అయినా కూడా డీసెంట్ కలెక్షన్స్ ని సొంతం చేసుకునే హీరోలలో నాని ముందు ఉంటాడు.అయితే ఇప్పుడు నేచురల్ స్టార్ కూడా తన బ్రాండ్ ఇమేజ్ ని పాన్ ఇండియా లెవల్ లో ఎస్టాబ్లిష్ చేసుకోవడానికి రెడీ అవుతున్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉంటే నాని కెరియర్ లో మొదటి సారిగా పవర్ ఫుల్ మాస్ రోల్ లో తనని తాను చూపించుకోవడానికి దసరా సినిమాతో ప్రేక్షకుల ముందుకి రావడానికి రెడీ అవుతున్నాడు. ఈ సినిమాతో పాన్ ఇండియా ఇమేజ్ అందుకోవాలని భావిస్తున్నాడు. రాయలసీమ బ్యాక్ డ్రాప్ ఫుల్ మాస్ క్యారెక్టర్ ని ఈ సినిమాలో నాని పోషించబోతూ ఉండటం విశేషం.ఓ విధంగా చెప్పాలంటే తమిళ నేటివిటీకి దగ్గర తక్కువ కమ్యూనిటీకి చెందిన యువకుడి పాత్రలో అతను కనిపిస్తున్నాడు. మాసిన గెడ్డం చెరిగిన జుట్టు మట్టిపట్టిన బట్టలతో నేచురాలిటీకి దగ్గరగా ఈ పాత్ర ఉన్నట్లు కనిపిస్తుంది. ఇదిలా ఉంటే రంగస్థలం సినిమాతో రామ్ చరణ్ ఇలాంటి పాత్రలోనే కనిపించి బ్లాక్ బస్టర్ హిట్ కొట్టాడు. ఇక అల్లు అర్జున్ కూడా పుష్పరాజ్ అనే క్యారెక్టర్ ని పుష్ప సినిమాలో ఇదే తరహాలో మాసివ్ లుక్ లో చేసి పాన్ ఇండియా లెవల్ లో హిట్ కొట్టాడు.ఇప్పుడు అలాంటి లుక్ ని నాని కూడా దసరాలో ట్రై చేస్తూ ఉన్నాడు. తాజాగా రిలీజ్ అయిన ట్రైలర్ చూస్తుంటే పీరియాడిక్ టచ్ ఈ మూవీ ఉన్నట్లు కనిపిస్తుంది. మరి మాసివ్ రియలిస్టిక్ రోల్స్ తో మెగా హీరోలు అందుకున్న పాన్ ఇండియా ఇమేజ్ ని దసరాతో నాని కూడా అందుకుంటాడా లేదా అనేది వేచి చూడాలి.

# పెళ్లి తరువాత కూడా అదే గ్లామర్ డోస్



భావ సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన కన్నడ భామ ప్రణీత శుభాష్ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. ఈ అమ్మడు కన్నడంలో స్టార్ హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకుంది. తెలుగులో అత్తారింటికి దారేది సినిమాలో పవన్ కళ్యాణ్ కి జోడీగా నటించింది. అలాగే ఎన్టీఆర్ కి జోడీగా కూడా నటించింది. ఇక ఆమె చివరిగా తెలుగులో హలో గురు ప్రేమకోసమే సినిమాలో కనిపించింది. అలాగే ఎన్టీఆర్ బయోపిక్ లో కూడా ఓ పాత్రలో కనిపించింది.కరోనా సమయంలో ప్రణీత చేసిన సోషల్ యాక్టివిటీస్ భాగా పాపులర్ అయ్యాయి. 2021లో ఆమె నితిన్ రాజు అనే వ్యాపారవేత్తని పెళ్లి చేసుకుంది. పెళ్లి తర్వాత కూడా ఈ అమ్మడు సినిమాలలో సందడి చేసింది. హిందీలో రెండు సినిమాలలో ఆడిపాడింది. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఈ బ్యూటీకి కూతురు కూడా పుట్టింది. అయితే కూతురు పుట్టిన తర్వాత కూడా ఈ అమ్మడు గ్లామర్ లో ఎలాంటి మార్పులు రాలేదని చెప్పాలి. అంతే అందంతో మెరిసిపోతుంది.అలాగే మంచి ఫిట్ నెస్ తో ఎప్పటికప్పుడు హాట్ ఫోటోలతో సందడి చేస్తుంది. ఇక పాప పుట్టిన కూడా ఈ అమ్మడు సినిమాలు మాత్రం ఆపలేదు. ప్రస్తుతం మలయాళంలో స్టార్ హీరో దిలీప్ 148వ సినిమాలో లీడ్ లో నటిస్తుంది. ఈ సినిమా షూటింగ్ రీసెంట్ గా స్టార్ట్ అయ్యింది. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో ఈ అమ్మడుకి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది.రెగ్యులర్ గా ఇన్స్టాగ్రామ్ లో హాట్ ఫోటోలు షేర్ చేయడంతో తనకి సంబందించిన ప్రతి మూవ్మెంట్ ని పంచుకుంటుంది. దీంతో ప్రణీతని చాలా మంది ఫాలో అవుతూ ఉంటారు. తాజాగా ఈ అమ్మడు సన్ లైట్ వెలుగులో జీన్స్ ఫ్యాంట్ బ్లౌజ్ తో తీసుకున్న ఫోటోలో చాలా హాట్ గా కనిపిస్తుంది. ఈ లుక్ చూసిన తర్వాత ప్రస్తుతం ఉన్న హీరోయిన్స్ కి గట్టిపోటీ ఇచ్చేలా ఉందనే మాట వినిపిస్తుంది

# సందీప్ లమిచానేకు భారీ ఊరట.. నేపాల్ క్రికెట్ అసోసియేషన్ కీలక నిర్ణయం




నేపాల్ క్రికెట్ అసోసియేషన్ తమ ఆటగాడు సందీప్ లమిచానేకు భారీ ఊరట కలిగించింది.అతడిపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో రానున్న నేపాల్ క్రికెట్ వరల్డ్కప్ లీగ్ 2 ట్రై సిరీస్లో ఆడేందుకు లమిచానేకు మార్గం సుగమమైంది. ఈ విషయాన్ని నేపాల్ క్రికెట్ అసోసియేషన్ జనరల్ మేనేజర్ బ్రిటాంట్ ఖనాల్ ధ్రువీకరించాడు.అత్యాచార ఆరోపణలతో అరెస్టుఈఎస్పీఎన్క్రిక్ఇన్ఫోతో మాట్లాడిన ఖనాల్.. కోర్టు షరతులకు లోబడే ప్రస్తుతం అతడిని స్వదేశంలో సిరీస్ ఆడేందుకు అనుమతించామని పేర్కొన్నాడు. ఒకవేళ నేపాల్ జట్టు విదేశాల్లో సిరీస్ ఆడేందుకు వెళ్లాల్సి వస్తే న్యాయస్థానం చెప్పినట్లుగానే నడుచుకుంటామని స్పష్టం చేశాడు. కాగా 22 ఏళ్ల సందీప్ లమిచానే అత్యాచార ఆరోపణలతో గతేడాది సెప్టెంబరులో అరెస్టైన సంగతి తెలిసిందే.ఈ క్రమంలో దాదాపు మూడు నెలల పాటు జైల్లో ఉన్న అతడికి ఇటీవలే పఠాన్ కోర్టు బెయిల్ ఇవ్వడంతో విముక్తి లభించింది. అయితే, తీర్పు వచ్చేంత వరకు దేశం వదిలివెళ్లొద్దని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నేపాల్ క్రికెట్ అసోసియేషన్ ఈ మేరకు అతడిపై సస్పెన్షన్ను ఎత్తివేసింది. దీంతో స్వదేశంలో నమీబియా, స్కాట్లాండ్తో జరుగనున్న ట్రై సిరీస్లో అతడు ఆడనున్నాడు.కాగా నేపాల్ కెప్టెన్గా ఉన్న సందీప్ లమిచానే.. ఐపీఎల్ సహా బీబీఎల్, పీఎస్ఎల్, బీపీఎల్, సీపీఎల్ వంటి టీ20 లీగ్లలో ఆడాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190